ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు


SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy  e - paper.vaarthasandhya.com  సంపుటి : 01 సంచిక : 160 శుక్రవారం 29 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy  e - paper.vaarthasandhya.com  VOLUME : 01  Issue : 160  Friday  29 - 05 - 2026  Editor : Seggem Kiran Kumar  Pages : 08  Price : 6/-

# ఆధార్ తరహాలో యూనిక్ ఐడెంటిటీ నంబర్


- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సూచనలు
- పౌరుల సమగ్ర సంక్షేమ పథకాలపై యూనిఫైడ్ కార్డు రూపొందించాలన్న సీఎం
- ఎంత లబ్ధి జరుగుతుందో తెలిసేలా కార్డులు ఉండాలని సూచన
- ఆధార్ తరహాలో నంబర్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలన్న రేవంత్



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 28 :**
పౌరుల సమగ్ర సంక్షేమ పథకాలపై యూనిఫైడ్ కార్డు రూపొందించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఎవరికి ఎంత లబ్ధి జరుగుతుందో తెలిసేలా ఈ కార్డులు ఉండాలన్నారు. అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటా సేకరణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆధార్ తరహాలో యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రేవంత్‌రెడ్డి సూచించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలనూ సేకరించాలన్నారు.రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా 'సమగ్ర సంక్షేమ కార్డు'ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద, ఎంత మేర లబ్ధి చేకూరుతోందో ఈ కార్డు ద్వారా స్పష్టంగా తెలిసేలా ఉండాలన్నారు. తక్షణమే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల డేటాను సేకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు.సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా - మిగతా 2 లో

# కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చింది

- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్
- త్వరలో కాజీపేటలో ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని వెల్లడి
- రానున్న ఐదేళ్లలో 200 ఇంటర్ సిటీ రైళ్లను తయారు చేస్తుందన్న మంత్రి
- ఇక్కడ తయారయ్యే రైళ్లను స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగిస్తామన్న మంత్రి



**వార్త సంధ్య, హైదరాబాద్, మే 28 :**
తెలంగాణ రాష్ట్రంలోని కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చిందని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. త్వరలో అక్కడ ఇంటర్ సిటీ రైళ్ల తయారీ ప్రారంభమవుతుందని అన్నారు. రానున్న ఐదేళ్లలో ఈ యూనిట్ 200 ఇంటర్ సిటీ రైళ్లను - మిగతా 2 లో

## రాయదుర్గంలో ఎకరా రూ.237 కోట్లు!

- టీజీఐఐసీ వేలంలో రికార్డు ధర పలికిన ధర
- పాన్ మక్తాలోని సర్వే నెంబర్‌లోని 6 ఎకరాల 29 గుంటలకు వేలం
- వేలంలో భూమిని దక్కించుకున్న గౌర వెంచర్స్


2 లో

## మృత్యుశిఖరంలా ఎవరెస్ట్ మారుతోం

- ఎవరెస్ట్‌పై 8,000 మీటర్లు దాటాక 'డెత్ జోన్' ప్రారంభం
- ఆక్సిజన్ కొరతతో మెదడు, ఊపిరితిత్తులు విఫలమయ్యే ప్రమాదం
- ఈ సీజన్‌లో ఇద్దరు భారతీయులతో సహా ఐదుగురి మృతి
- శిఖరంపై రద్దీ పెరగడం మరణాలకు మరో ప్రధాన కారణం
- ఎక్కడం కన్నా దిగడమే అత్యంత ప్రమాదకరమని నిపుణుల హెచ్చరిక


2 లో

# అంతరిక్ష రంగంలో హైదరాబాద్ సత్తా

- రీయూజబుల్ ఇంజిన్ పరీక్ష విజయవంతం!
- పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో ఇంజిన్‌ను అభివృద్ధి చేసిన స్టార్టప్ 'అభ్యోమ్'
- అంతరిక్ష ప్రయోగాల ఖర్చును తగ్గించడంలో కీలక ముందడుగు
- ఈ స్టార్టప్‌కు బిట్స్ పిలానీ, ఐఐటీలు, ఇస్రో నుంచి మద్దతు

**వార్త సంధ్య, హైదరాబాద్, మే 28 :**
భారత అంతరిక్ష రంగంలో హైదరాబాద్‌కు చెందిన స్పేస్‌టెక్ స్టార్టప్ 'అభ్యోమ్ స్పేస్‌టెక్ & డిఫెన్స్' ఒక కీలక మైలురాయిని అందుకుంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన రీయూజబుల్ లిక్విడ్ రాకెట్ ఇంజిన్ క్వాలిఫికేషన్ టెస్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు సంస్థ ప్రకటించింది. ఈ విజయం, అంతరిక్ష ప్రయోగాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించే సాంకేతికతలో భారత్ ముందడుగు వేయడానికి దోహదపడనుంది.కంపెనీకి చెందిన కమర్షియల్ టెస్ట్ ఫెసిలిటీలో ఈ పరీక్షలు - మిగతా 2 లో

ABYOM

# యువతకు అవకాశాల వెల్లువ.. నైపుణ్యాలతో సిద్ధంగా ఉండండి

- జెన్-జీతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్
- రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నామన్న మంత్రి లోకేష్
- అవకాశాలకు అనుగుణంగా యువతను నైపుణ్య వనరులుగా తీర్చిదిద్దుతాం
- సోషల్ మీడియాలోని ఫేక్ కంటెంట్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచన
- విజయానికి దగ్గరి దారులు లేవని, కష్టపడితేనే ఫలితం ఉంటుందన్నారు
- యువత రాజకీయాల్లోకి రావాలని, టీడీపీ అవకాశాలు కల్పిస్తుందని పిలుపు



**వార్త సంధ్య, అమరావతి, మే 28 :**
యువత అంకితభావం, సమష్టి కృషి, త్యాగనిరతి వంటి గుణాలను అలవర్చుకుని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు యువతను నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. మహానాడు సందర్భంగా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో "జెన్-జీ" యువతతో ఆయన ప్రత్యేకంగా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువత అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిస్తూ, రాష్ట్ర అభివృద్ధిపై ప్రభుత్వ దార్శనికతను వివరించారు.రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు ప్రజా ప్రభుత్వం క్లస్టర్ ఆధారిత విధానంతో ముందుకు సాగుతోందని లోకేష్ తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించామని, డేటా, ఐటీ, క్వాంటం టెక్నాలజీ, రాయలసీమలో ఆటోమోటివ్, కర్నూలులో పునరుత్పాదక ఇంధన వనరుల వంటి రంగాల్లో ప్రత్యేక క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. దీనివల్ల ఒకేచోట ప్రధాన పరిశ్రమలతో పాటు, వాటికి అవసరమైన అనుబంధ పరిశ్రమలు, విడిభాగాల తయారీ యూనిట్లు ఏర్పాటవుతాయని, తద్వారా పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ (ఎకోసిస్టమ్) నిర్మితమవుతుందని అన్నారు. "రాష్ట్రానికి ఇప్పటివరకు రూ.23 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్, రిలయన్స్ వంటి దిగ్గజ సంస్థలు ముందుకొస్తున్నాయి. ఈ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి" అని ఆయన సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పాఠ్యప్రణాళికలో మార్పులు తెచ్చి, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతకు అందిస్తామన్నారు.సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే తప్పుడు సమాచారం - మిగతా 2 లో


2 లో

## ఎన్టీఆర్ స్ఫూర్తితోనే అన్న క్యాంటీన్లు

- జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- ఎన్టీఆర్ స్ఫూర్తితోనే కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లు నిర్వహిస్తోంది
- ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పవన్ కళ్యాణ్ నివాళి
- ప్రజా పక్షం వహించిన గొప్ప నేత ఎన్టీఆర్ అని కొనియాడిన పవన్
- రూ.2కే కిలో బియ్యం పథకంతో పేదల ఆకలి తీర్చారని ప్రశంస

# కర్ణాటక ముఖ్యమంత్రి పదవికి సిద్ధరామయ్య రాజీనామా

- సిద్ధరామయ్య భావోద్వేగ ప్రకటన
- అధిష్ఠానం ఆదేశాల మేరకే ఈ నిర్ణయమన్న సిద్ధూ
- గవర్నర్ కార్యాలయంలో రాజీనామా పత్రం సమర్పణ
- పోరపాటున రాజకీయాల్లోకి వచ్చానంటూ భావోద్వేగం



**వార్త సంధ్య, బెంగళూరు , మే 28 :**
కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది.ముఖ్యమంత్రి - మిగతా 2 లో

# ఎన్టీఆర్‌కు భారతరత్న మహానాడులో ఏకగ్రీవ తీర్మానం

- తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అన్న చంద్రబాబు
- ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలనేది ప్రజలందరి డిమాండ్ అని వ్యాఖ్య
- తొమ్మిది నెలల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడం ఎన్టీఆర్ కు తప్ప ఎవరికీ సాధ్యం కాలేదన్న చంద్రబాబు




**వార్త సంధ్య, అమరావతి, మే 28 :**
చరిత్ర ఉన్నంత వరకు తెలుగువారి గుండెల్లో ఎన్టీఆర్ శాశ్వతంగా నిలిచిపోతారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ కు భారతరత్న ఇవ్వాలనేది ప్రజలందరి డిమాండ్ అని చెప్పారు. మహానాడులో చంద్రబాబు మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి, దేశానికి విశేష సేవలు అందించిన ఎన్టీఆర్ కు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వాలని మహానాడులో ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఎన్టీఆర్ ఆశయ సాధనలో భాగంగానే మహిళలకు 33 శాతం సీట్ల ప్రకటనను నారా లోకేశ్ చేశారని - మిగతా 2 లో

# చంద్రుడి దక్షిణ ధ్రువంలో భూగర్భ మంచు

- చంద్రయాన్-2 గుర్తింపు!
- ఏడేళ్లుగా పనిచేస్తున్న చంద్రయాన్-2 ఆర్బిటర్ ద్వారా కీలక డేటా సేకరణ
- అహ్మదాబాద్ పీఆర్ఎల్ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి
- భవిష్యత్ యాత్రలకు ఇంధనంగా మారనున్న చంద్రుడిపై నీరు
- అమెరికా, చైనా వంటి దేశాల లూనార్ మిషన్లకు ఈ ఆవిష్కరణ కీలకం

**వార్త సంధ్య, ఢిల్లీ, మే 28 :**
భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మరో అద్భుతమైన ఆవిష్కరణతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది. ఏడేళ్ల క్రితం ప్రయోగించిన చంద్రయాన్-2 మిషన్‌లోని ఆర్బిటర్, చంద్రుని దక్షిణ ధ్రువంపై భారీగా భూగర్భ మంచు నిల్వలు ఉన్నట్లు బలమైన ఆధారాలను గుర్తించింది. ఈ ఆవిష్కరణ భవిష్యత్ అంతరిక్ష - మిగతా 2 లో



# సంపాదకీయం

## 'భరోసా' భయాలు..!



భారత్ తన ఇంధన భద్రత గురించి భయపడనక్కరలేదు, ఎంత చమురు కొనాలనుకుంటే అంతా సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నాం అంటూ అమెరికా విదేశాంగమంత్రి మార్క్ రూబియో చేసిన వ్యాఖ్యలో, భరోసా కంటే బెదిరింపే ఎక్కువగా ఉందని విశ్లేషకులు అంటున్నారు. రెండుదేశాల మధ్యా ఇంధన సహకారమే తన పర్యటనలో అత్యంత కీలకాంశమని ఆయన ముందే చెప్పివచ్చారు. తాము అమెరికా రికార్డుస్థాయిలో చమురు ఉత్పత్తి, ఎగుమతులు చేస్తున్నదని గుర్తుచేయడంతోపాటు, భారతదేశ ఇంధన దిగుమతుల్లో సింహభాగం తమదే కావాలని కూడా స్పష్టంచేశారు. తమతోపాటు, వెనెజువెలాకు కూడా అధికవాటా దక్కాలని కోరడమే కాక, ఆ దేశాధ్యక్షురాలు భారత్‌లో పర్యటించబోతున్న తరుణంలో, ఉభయదేశాలూ కలసి ముందుకు సాగాలన్నారు. డెల్సీ రోడ్రిగ్స్ పర్యటనను అటు వెనెజువెలా కానీ, ఇటు భారతదేశం కానీ ప్రకటించకుండా రూబియో నిర్ణయించడమేమిటని ప్రశ్నించిన కాంగ్రెస్, గత ఏడాది మే 10వతేదీ సాయంత్రం ఐదున్నరగంటలకు ఆపరేషన్ సిందూర్ నిలిపివేసినట్టుగా భారతప్రభుత్వం కంటే ముందు ఈయనే చెప్పిన విషయాన్ని గుర్తుచేసింది. భారతదేశానికి సంబంధించిన కీలక నిర్ణయాలు ముందుగా అమెరికాలో జరుగుతున్నాయా? అని కాంగ్రెస్ ప్రశ్న. చమురు లోటు తీవ్రంగా ఎదుర్కొంటున్న భారతదేశం తన దిగుమతుల జాబితాలో అమెరికా, వెనెజువెలాలను ప్రథమస్థానాల్లో నిలుపుకొని భారీగా కొనుగోళ్ళు జరపాలన్నది రూబియో మాటల సారాంశం. తాము ఆరంభించిన ఇరాన్ యుద్ధంతో భారత్‌లో ఏర్పడిన చమురు సంక్షోభాన్ని ఎలా పరిష్కరించుకోవాలో అమెరికాయే చెబుతోంది. వెనెజువెలా చమురుమీద ఆంక్షలతో భారత్‌ను గతంలో బెదిరించి, దిగుమతులకు మోకాలడ్డిన అమెరికా, ఇప్పుడు తానే స్వయంగా సేల్స్‌మ్యాన్ పాత్ర పోషిస్తోంది. జనవరిలో ఒక అర్థరాత్రి కుట్రలో నికోలస్ మదురోను ఎత్తుకుపోయి, ఆ స్థానంలో నమ్మినబంటును ప్రతిష్ఠించుకున్నాక, వెనెజువెలా చమురును అమెరికన్ కంపెనీలే 'డ్రిల్ బేబీ డ్రిల్' అని ఆడుతూ పాడుతూ తవ్వుకుంటున్నాయి, అమ్ముకుంటున్నాయి. అప్పటివరకూ ఈ పాపిష్ఠి చమురుమీద ఉన్న ఆంక్షలన్నీ ఒక్కసారిగా తొలగి, పెత్తనం అమెరికా చేతిలోకి పోయింది. పేరుకు మరోదేశమైనా సర్వాధికారం అమెరికాదే కనుక, ఆ కంపెనీల, వాటి లాభాల పరిరక్షణ ప్రధానం. ఇప్పటికే అమెరికా ఆంక్షలు, హెచ్చరికల దెబ్బకు రష్యా చమురు వెనుకపట్టుపట్టి మన దిగుమతుల్లో వెనెజువెలా ముందుకు వచ్చింది. మొన్నటివరకూ ఒక్కచుక్కా కొనుగోలుచేయని వెనెజువెలానుంచి రెండునెలలుగా భారీ దిగుమతులు సాగుతున్నాయి. రష్యానుంచి చమురు దిగుమతి చేసుకుంటున్నందుకు రెట్టింపు సుంకాలతో మనను శిక్షించిన అమెరికా, ఆ తరువాత తాను ఆరంభించిన ఇరాన్ యుద్ధం కారణంగా తానే రష్యానుంచి కొనుగోళ్ళకు అనుమతులు ఇచ్చి, ఈ నెలలో మళ్ళీ తలుపులు మూసివేసింది. రష్యా బదులు వెనెజువెలా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుందని ఫిబ్రవరిలో అమెరికా అధ్యక్షుడు చెప్పిన ప్రకారంగానే అంతా జరుగుతోంది. రూబియో మార్గనిర్దేశనం ప్రకారం నడుచుకుంటే రేపటిరోజుల్లో అమెరికా, వెనెజువెలాలే మన ఇంధనభద్రతను నిర్ణయిస్తాయి. ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతిదారు అయిన భారతదేశం ఇంధనం కోసం ఏటా రమారమి 175 బిలియన్ డాలర్ల ధనం ఖర్చుచేస్తున్నది. పెట్రోడాలర్ ఆధిపత్యానికి వివిధ దేశాలు, కూటములనుంచి సవాళ్ళు ఎదురవుతున్న నేపథ్యంలో, మిత్రదేశమైన భారత్‌ను నియంత్రించడానికి అమెరికా ప్రయత్నిస్తోంది. ద్వైపాక్షిక వాణిజ్యంలో భారత్‌కు కాస్తంత మిగులు కూడా ఉన్నందున, భారత ఇంధన సరఫరాలను తన నియంత్రణలోకి తీసుకోవాలని చూస్తోంది. ఘర్షణపడే ఉద్దేశం లేదని అంటూనే అమెరికా తాను చేయదల్చుకున్నది చేస్తోంది. ట్రంప్ విధానాలు కేవలం భారత్‌ను ఉద్దేశించినవి కావని అంటున్నప్పటికీ, ట్రంప్ మలిరాకడ తరువాత భారత్‌కు అన్నిరంగాల్లోనూ ఒనగూరిన నష్టం అపారమైనది. రష్యన్ చమురుమీద ఆంక్షలు, ప్రతీకార సుంకాలతో భారత ఎగుమతులను దెబ్బతీయడం, గ్రీన్ కార్డు, వీసా నియంత్రణలు, పాకిస్థాన్ ప్రాధాన్యం పెరగడం వంటి పరిణామాలు రూబియో ఎంత కాదన్నా నిజాలు కాకపోవు. ఐదువందల బిలియన్ డాలర్లు విలువచేసే అమెరికన్ ఉత్పత్తుల కొనుగోలుకు సరేననేంతవరకూ ట్రంప్ ప్రభుత్వం భారత్‌ను వదిలిపెట్టలేదు. మోదీ ఓ అద్భుతవ్యక్తి, ఆప్తమిత్రుడు అంటూనే ఖరీదైన అమెరికా, వెనెజువెలా చమురు భారత్‌కు అంటించేందుకు రంగం సిద్ధమవుతోంది.

## చంద్రుడి దక్షిణ ధ్రువంలో భూగర్భ మంచు

**మొదటిపేజీ తరువాయి -** యాత్రల గతిని మార్చే కీలక పరిణామంగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. 2019లో చంద్రయాన్-2 ల్యాండర్ చంద్రుడిపై దిగడంలో విఫలమైనప్పటికీ, దాని ఆర్బిటర్ మాత్రం కక్ష్యలో తిరుగుతూ విలువైన సమాచారాన్ని పంపుతూనే ఉంది. తాజాగా, ఆర్బిటర్‌లోని 'డ్యుయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపెర్చర్ రాడార్' పంపిన డేటాను అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ శాస్త్రవేత్తలు విశ్లేషించారు. చంద్రుడిపై ఎన్నడూ సూర్యరశ్మి సోకని, అత్యంత శీతలంగా ఉండే శాశ్వత చీకటి ప్రాంతాల ఉపరితలం కింద ఈ మంచు నిల్వలు ఉన్నట్లు వారు నిర్ధారించారు. ముఖ్యంగా, ఫాస్టిని బేసిన్‌లోని ఒక బిలం కింద మంచు ఉనికికి బలమైన ఆధారాలు లభించాయని తెలిపారు. ఈ ఆవిష్కరణ అంతరిక్ష రేసులో వ్యూహాత్మకంగా భారత్‌కు గొప్ప ఆధిక్యాన్ని ఇచ్చింది. చంద్రుడిపై కనుగొన్న ఈ నీటి మంచును భవిష్యత్తులో తాగునీరుగా, శ్వాసకు అవసరమైన ఆక్సిజన్‌గా, రాకెట్లకు అవసరమైన హైడ్రోజన్ ఇంధనంగా మార్చుకోవచ్చు. దీనివల్ల భూమి నుంచి ఇంధనాన్ని మోసుకెళ్లే ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. ప్రస్తుతం అమెరికా, చైనా వంటి దేశాలు చంద్రుని దక్షిణ ధ్రువంపై స్థావరాలు ఏర్పాటు చేసేందుకు పోటీ పడుతున్నాయి. ఈ తరుణంలో, నీటి వనరులు ఎక్కడ ఉన్నాయో కచ్చితమైన సమాచారాన్ని అందించి భారత్ కీలక పాత్ర పోషించింది. చంద్రయాన్-3 విజయంతో పాటు, ఇప్పుడు చంద్రయాన్-2 అందించిన ఈ డేటా ప్రపంచ అంతరిక్ష సమాజానికి అత్యంత విలువైనదిగా మారింది.

## ఎన్టీఆర్‌కు భారతరత్న.మహానాడులో ఏకగ్రీవ తీర్మానం

**మొదటిపేజీ తరువాయి -** చంద్రబాబు తెలిపారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు అనేది టీడీపీ సిద్ధాంతమని... ఎన్టీఆర్ ఇచ్చిన ఆ సిద్ధాంతం శాశ్వతంగా కొనసాగుతుందని చెప్పారు. పార్టీని స్థాపించిన తొమ్మిది నెలల్లోనే అధికారాన్ని చేజిక్కించుకోవడం ఎన్టీఆర్ కు తప్ప చరిత్రలో మరెవరికీ సాధ్యం కాలేదని అన్నారు. సినీ చరిత్రలో ఎన్టీఆర్ కు ప్రత్యామ్నాయం లేదని... ఆయన చేసిన పాత్రలు మళ్లీ చేయాలంటే ఆయనే మళ్లీ పుట్టాలని వ్యాఖ్యానించారు.


## అంతరిక్ష రంగంలో హైదరాబాద్ సత్తా

**మొదటిపేజీ తరువాయి -** నిర్వహించారు. ఈ విజయం, త్వరలో చేపట్టనున్న 'హోప్' (వర్టికల్ టేకాఫ్ అండ్ వర్టికల్ ల్యాండింగ్) అనే పునర్వినియోగ రాకెట్ ప్రాజెక్టుకు, అలాగే క్రయోజెనిక్ ఇంజిన్ అభివృద్ధికి ఎంతగానో సహాయపడుతుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఈ పరీక్షల్లో వాడిన ఇంజిన్ సిస్టమ్స్, కంట్రోల్ ఆర్కిటెక్చర్ సహా అన్ని పరికరాలను తమ ఇంజనీరింగ్ బృందమే దేశీయంగా తయారు చేసిందని అబ్యోమ్ వెల్లడించింది. ఈ విజయంపై సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో జైనుల్ అబిదీన్ మాట్లాడుతూ "భారత్‌లో స్వదేశీ పునర్వినియోగ ప్రొపల్షన్ వ్యవస్థల నిర్మాణంలో ఈ పరీక్షలు చాలా కీలకం. అంతరిక్ష ప్రయోగాల ఖర్చును భారీగా తగ్గించడంలో ఇవి సహాయపడతాయి. తక్కువ ఖర్చుతో కూడిన రీయూజబుల్ స్పేస్‌ఫ్లైట్ కోసం టెక్నాలజీని మరింత ముందుకు తీసుకెళ్తున్నాం" అని వివరించారు. బిట్స్ పిలానీ హైదరాబాద్ క్యాంపస్ ఇంక్యుబేటర్ నుంచి అబ్యోమ్ స్టార్టప్ ప్రారంభమైంది. ఈ సంస్థకు ఐఐటీ మద్రాస్, ఐఐటీ బాంబేతో పాటు డీఎస్‌టీ, ఇస్రో, మెయిటీ వంటి ప్రభుత్వ సంస్థల నుంచి కూడా మద్దతు లభిస్తోంది. రాబోయే రోజుల్లో రీయూజబుల్ రాకెట్ ప్రోటోటైప్ ప్రదర్శనలు, క్రయోజెనిక్ ఇంజిన్ల అభివృద్ధిపై దృష్టి సారించనున్నట్లు సంస్థ స్పష్టం చేసింది.

## ఎన్టీఆర్ స్ఫూర్తితోనే అన్న క్యాంటీన్లు

**మొదటిపేజీ తరువాయి -** దివంగత మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) జయంతి సందర్భంగా జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కథానాయకుడిగా ప్రేక్షకుల నీరాజనాలు అందుకుని, ఆ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి ప్రజా పక్షాన నిలిచిన గొప్ప నేత ఎన్టీఆర్ అని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ అందించిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ఆయన ప్రవేశపెట్టిన 'రెండు రూపాయలకే కిలో బియ్యం' పథకం చారిత్రాత్మకమైనదని గుర్తుచేశారు. ఎన్టీఆర్ చూపిన అదే స్ఫూర్తితో ప్రస్తుత కూటమి ప్రభుత్వం 'అన్న క్యాంటీన్ల'ను నిర్వహిస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. పేదలకు అండగా నిలవాలన్న ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళుతున్నామని తన సందేశంలో స్పష్టం చేశారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయన స్మృతికి నివాళులు అర్పిస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు.

# సీఎం పదవికి సిద్ధరామయ్య రాజీనామా



**మొదటిపేజీ తరువాయి -** సిద్ధరామయ్య తన పదవికి రాజీనామా చేశారు. గురువారం మధ్యాహ్నం డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో కలిసి బెంగళూరులోని లోక్‌భవన్‌కు వెళ్లిన ఆయన, తన రాజీనామా పత్రాన్ని గవర్నర్ కార్యాలయంలో అందజేశారు. గవర్నర్ అందుబాటులో లేకపోవడంతో, ఆయన ప్రత్యేక కార్యదర్శికి రాజీనామా పత్రాన్ని సమర్పించినట్లు సిద్ధరామయ్య స్వయంగా వెల్లడించారు. అనంతరం డీకే శివకుమార్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధిష్ఠానం సూచనల మేరకే తాను రాజీనామా చేసినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సిద్ధరామయ్య కొంత భావోద్వేగానికి గురయ్యారు. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. 2006లో కాంగ్రెస్ పార్టీలో చేరానని, అప్పటి నుంచి పార్టీ తనను ఎంతో ఆదరించిందని గుర్తుచేసుకున్నారు. మంత్రిగా, రెండుసార్లు సీఎంగా, ప్రతిపక్ష నేతగా తనకు అనేక అవకాశాలు ఇచ్చిందని తెలిపారు. ఏడు కోట్ల కన్నడ ప్రజలకు సేవ చేసే భాగ్యం దక్కడం అదృష్టమన్నారు. తాను ముఖ్యమంత్రి అవుతానని కలలో కూడా అనుకోలేదని సిద్ధరామయ్య అన్నారు. తన కుటుంబంలో ఎవరికీ రాజకీయ నేపథ్యం లేదని, తాను గ్రామీణ జీవితం నుంచి వచ్చానని, పొరపాటున రాజకీయాల్లోకి అడుగుపెట్టానని వ్యాఖ్యానించారు. తన రాజకీయ జీవితంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ, ముఖ్యంగా తనకు సీఎం అయ్యే అవకాశం కల్పించిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రిగా మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించానని చెప్పారు. సామాజిక న్యాయం, సమానత్వాన్ని తాను బలంగా నమ్ముతానని, సమాజంలో అసమానతలు తొలగిపోయి అందరికీ సమాన అవకాశాలు దక్కాలన్నదే తన ఆకాంక్ష అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. తన రాజీనామాను గవర్నర్ ఆమోదిస్తారనే విశ్వాసం తనకుందని ఆయన తెలిపారు.

# మృత్యుశిఖరంలా ఎవరెస్ట్ మారుతోం



**మొదటిపేజీ తరువాయి -** అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం చాలామందికి ఒక కల. కానీ ఆ కలను నిజం చేసుకునే ప్రయాణంలో ప్రాణాలకే ముప్పు తెచ్చే ఒక ప్రమాదకరమైన ప్రదేశం ఉంది. అదే 'డెత్ జోన్'. సముద్ర మట్టానికి 8,000 మీటర్ల (26,247 అడుగుల) ఎత్తు దాటిన తర్వాత మొదలయ్యే ఈ ప్రాంతంలో, ప్రాణవాయువు కొరతతో మానవ శరీరం నిమిషనిమిషానికీ క్షీణించడం మొదలవుతుంది. ఈ ఏడాది (2026) సీజన్‌లో ఇద్దరు భారతీయ పర్వతారోహకులతో సహా కనీసం ఐదుగురు ఇక్కడ ప్రాణాలు కోల్పోయారు. డెత్ జోన్‌లో గాలిలో ఆక్సిజన్ స్థాయి సముద్ర మట్టంతో పోలిస్తే కేవలం మూడో వంతు మాత్రమే ఉంటుంది. దీనివల్ల 'హైపోక్సియా' (ఆక్సిజన్ కొరత) ఏర్పడి, మొదట మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీంతో గందరగోళం, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం, భ్రాంతులు కలగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సప్లిమెంటరీ ఆక్సిజన్ లేకుండా శిఖరంపైకి చేరితే, కేవలం 4 నిమిషాల్లో స్పృహ కోల్పోయి, 6 నిమిషాల్లో మరణం సంభవిస్తుంది. దీంతోపాటు మెదడు వాపు, ఊపిరితిత్తులలో నీరు చేరడం వంటి ప్రాణాంతక సమస్యలు కూడా తలెత్తుతాయి. శరీరం తనను తానే తినేస్తూ, కండరాలు బలహీనపడతాయి. ఇటీవల కాలంలో ఎవరెస్ట్‌పై రద్దీ విపరీతంగా పెరిగిపోవడం మరణాలకు మరో ప్రధాన కారణంగా మారింది. ఈ సీజన్‌లో నేపాల్ వైపు నుంచి ఒకేరోజు 274 మంది శిఖరాన్ని చేరుకున్నారు. ఈ రద్దీ వల్ల ప్రమాదకరమైన హిల్లరీ స్టెప్ వంటి ప్రాంతాల్లో గంటల తరబడి నిల్చోవాల్సి వస్తోంది. మైనస్ 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో ఇలా నిరీక్షించడం వల్ల శరీరం చల్లబడిపోవడమే కాకుండా, వెంట తెచ్చుకున్న ఆక్సిజన్ నిల్వలు కూడా వేగంగా అయిపోతున్నాయి. ఎక్కడం కన్నా దిగడమే అత్యంత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శిఖరాన్ని చేరుకునేసరికే శక్తి మొత్తం అయిపోవడంతో, తిరుగు ప్రయాణంలో నీరసం, ఆక్సిజన్ కొరత కారణంగా చాలామంది కుప్పకూలుతున్నారు. ఈ ఏడాది మరణించిన ఇద్దరు భారతీయులు కూడా శిఖరాన్ని అధిరోహించి, కిందకు దిగివస్తుండగా ప్రాణాలు విడిచారు. డెత్ జోన్‌లో వీలైనంత తక్కువ సమయం గడపాలని, వాతావరణం అనుకూలించకపోతే వెనుదిరగాలని నిపుణులు సూచిస్తున్నారు.

## యువతకు అవకాశాల వెల్లువ.. నైపుణ్యాలతో సిద్ధంగా ఉండండి



**మొదటిపేజీ తరువాయి -** పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని లోకేష్ హెచ్చరించారు. డీఎస్సీ విషయంలో ప్రతిపక్ష నేత నిరాధార ఆరోపణలు చేసి లక్షలాది మంది యువతను ఆందోళనకు గురిచేశారని విమర్శించారు. "మేం పారదర్శకంగా 150 రోజుల్లో డీఎస్సీ ప్రక్రియను పూర్తిచేశాం. సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని గుడ్డిగా నమ్మకుండా, వాస్తవాలను సరిచూసుకోవాలి," అని ఆయన యువతకు హితవు పలికారు. కష్టపడటం ఒక్కటే విజయానికి మార్గమని, దానికి దగ్గరి దారులు ఉండవని లోకేష్ తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. "నేను మా నాన్నగారితో పోటీ పడాలంటే ఆయన కంటే ఎక్కువ కష్టపడాలి. నా పాదయాత్రలో రోజూ పోరాటం ఎదుర్కొన్నాను. 2019లో ఓడిపోయినా భయపడలేదు, 2024లో 91 వేల మెజారిటీతో గెలిచాను. ఆ రోజు భయపడి ఉంటే ఇది సాధ్యమయ్యేది కాదు" అని అన్నారు. పరీక్షల్లో విఫలమైతే ఆత్మహత్యలకు పాల్పడటం సరికాదని, ఒక్క ఓటమి జీవితాన్ని నిర్ధారించదని విద్యార్థులకు ధైర్యం చెప్పారు. యువత రాజకీయాల్లోకి రావాలని, తెలుగుదేశం పార్టీ వారికి సముచిత అవకాశాలు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. పోరాట స్ఫూర్తిని అలవర్చుకోవాలని సూచించారు. మహిళా సాధికారత ప్రతి ఇంటి నుంచే మొదలుకావాలని, వారికి 33 శాతం రిజర్వేషన్ల అమలుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. యువతకు ఉద్యోగాల కల్పనే తమ ప్రభుత్వ ఏకైక అజెండా అని, పెద్ద పరిశ్రమలతో పాటు ఎంఎస్‌ఎంఈలకు కూడా అంతే ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులు వేమూరి సాత్విక్, చరణ్ యాదవ్, సత్యసాయి పవన్ కుమార్, ఖ్యాతి వర్ధిని పాల్గొన్నారు.

## కాజీపేటలో రైళ్ల తయారీ యూనిట్ పూర్తి కావొచ్చింది



**మొదటిపేజీ తరువాయి -** తయారు చేస్తుందని అన్నారు. కాజీపేట రైల్వే తయారీ యూనిట్‌పై ఆయన కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇక్కడ తయారయ్యే రైళ్లను దేశవ్యాప్తంగా స్వల్ప దూర ప్రయాణాల కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. కొత్తగా అందుబాటులోకి వచ్చే ఇంటర్ సిటీ రైళ్లు ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్, మెరుగైన వెంటిలేషన్‌తో రూపొందుతాయని అన్నారు. ప్రతి రైలులో 20 కోచ్‌లు ఉంటాయని అన్నారు. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రైళ్లను తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఈ రైళ్లలో రీజనరేటివ్ బ్రేకింగ్ ఉంటుందని అన్నారు. రైలు బ్రేకులు వేసినప్పుడు ఉత్పత్తి అయిన విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌లోకి పంపే ఆధునాతన పరిజ్ఞానంతో తయారు చేస్తున్నామని అన్నారు.

# ఆధార్ తరహాలో యూనిక్ ఐడెంటిటీ నంబర్



**మొదటిపేజీ తరువాయి -** రాష్ట్రంలోని ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ ప్రొఫైల్ ఒకే చోట అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ డేటాను అన్ని కోణాల్లో ఏఐ సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని అన్నారు. ఈ విధానం అనుసరించడం వల్ల నిజమైన అర్హులకు పథకాలు మరింత కచ్చితంగా చేరుతాయని, అదే సమయంలో అనర్హులను గుర్తించడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు ఇచ్చే పద్ధతికి బదులు, ఐటీ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర సంక్షేమ కార్డ్ ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు. టెక్నాలజీపై పట్టున్న, చురుగ్గా పనిచేసే యువ అధికారులను ఈ ప్రక్రియకు వినియోగించాలని చెప్పారు. ఈ కార్డులో ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాలు, ప్రభుత్వం తీసుకొస్తున్న బీమా పథకాల వివరాలు ఉండాలని చెప్పారు. అవసరమైతే ఆధార్ నంబర్ తరహాలో రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక యూనిక్ ఐడెంటిటీ నంబర్ ఇచ్చేలా ఆలోచించాలని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల ఎస్ ఈఈఈపీసీ సర్వే వివరాలను కూడా ఈ కార్డ్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. లబ్ధిదారుల వివరాలతో పాటు వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య, ఇతర వివరాలను సేకరించాలని ఐటీ శాఖను ఆదేశించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ జరగాలని సూచించారు. ఎక్కడైనా మరణ ధృవీకరణ పత్రం జారీ అయితే, ఆ సమాచారం చేయూత పెన్షన్ డేటాబేస్‌కు చేరాలని, వెంటనే దాని ఆధారంగా చర్యలు మొదలయ్యేలా ఉండాలని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య ప్రొఫైల్‌ను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో లింక్ చేయాలని చెప్పారు. కేరళం నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లే ఉద్యోగులకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలతో పాటు, పాస్‌పోర్టులు, వీసాల జారీకి సంబంధించిన సమాచారం ఒకేచోట అందుబాటులో ఉంచితే, అనధికార ఏజెంట్ల ప్రమేయం తగ్గుతుందని తెలిపారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా, తెలంగాణ ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం ప్రభావాన్ని అంచనా వేసేలా సమగ్ర సంక్షేమ కార్డు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఈ కార్డులపై మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్ కె. రామకృష్ణారావు సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టితో పాటు ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఈ విషయంపై ప్రత్యేకంగా చర్చించారు.

# సరికొత్త చరిత్ర..రాయదుర్గంలో ఎకరా రూ.237 కోట్లు!



**మొదటిపేజీ తరువాయి -** హైదరాబాద్ నగరంలో భూమి మరోసారి రికార్డు ధర పలికింది. టీజీఐఐసీ వేలంలో ఎకరా భూమి రూ.237 కోట్లు పలికి సరికొత్త రికార్డును సృష్టించింది. రాయదుర్గంలోని పాన్ మక్తాలోని సర్వే నెంబర్ 83/1లో 6 ఎకరాల 29 గుంటలకు వేలం వేశారు. ఈ క్రమంలో టీజీఐఐసీ భూముల వేలానికి అనూహ్య స్పందన లభించింది. ఈ వేలంలో భూమిని గౌర వెంచర్స్ దక్కించుకుంది. గత సంవత్సరం అక్టోబర్ నెలలో ఇదే ప్రాంతంలో ఎకరం ధర రూ.177 కోట్లు పలికిన విషయం తెలిసిందే. ఆరోజు 7 ఎకరాలకు రూ.1,357.59 కోట్లు వచ్చింది. టీజీఐఐసీ వేలం వేసే భూములు మంచి డిమాండ్ ఉంటోంది. సర్వే నెంబర్ 83/1లోని ప్లాట్ 1ఏ, 1ఎఫ్‌లోని 6.29 ఎకరాలు, ప్లాట్ నెంబర్ పీ4లోని 5.09 ఎకరాలు సహా మొత్తం 11.38 ఎకరాల భూమి వేలానికి నోటిఫికేషన్ వచ్చింది. ఎకరాకు రూ.139 కోట్ల ధరను నిర్ధారించారు. ఈ వేలం ద్వారా రూ.2 వేల కోట్లకు పైగా ఆదాయం వస్తుందని టీజీఐఐసీ అంచనా వేస్తోంది. ప్లాట్ నెంబర్ పీ4లోని భూములకు జూన్ 1న ఆన్ లైన్ లో వేలం నిర్వహించనున్నారు.

## దెబ్బతిన్న నరాలకు ఆధునిక శస్త్ర చికిత్స

### మెడ, భుజాల గాయాలపై అవగాహన సదస్సు







**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 28 ( వార్తా సంధ్య ) కామారెడ్డి, గురువారం:** హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోధ హాస్పిటల్ ఆధ్వర్యంలో కామారెడ్డి యశోద సెంటర్‌లో మెడ, భుజాల గాయాలు మరియు బ్రేక్యాల్ ప్లే సెస్ ఇంజురీ తో చేతి నరాల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పి. ప్రకాష్ మాట్లాడుతూ ప్రమాదాల వల్ల దెబ్బతిన్న నరాలకు ఆధునిక పద్ధతుల్లో శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చేతులకు సరఫరా చేసే నరాలు దెబ్బతింటే చేతుల కదలికలు తగ్గిపోవడం, భుజం బలహీనత, నరాల పనితీరు దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురవుతాయని వివరించారు. బాధితులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు మరియు ఫిజియోథెరపీ ద్వారా చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు మరియు రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి ఈ చికిత్సలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని వైద్యులు పేర్కొన్నారు. సమస్యను ప్రారంభ దశలోనే గుర్తించి వైద్యులను సంప్రదిస్తే చేతుల పనితీరును మెరుగుపరచే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు సూచించారు.

## ఖమ్మం లకారం లో ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి



**ఖమ్మం జిల్లా బ్యూరో, మే 28 (వార్త సంధ్య) :** ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ వద్ద తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) గారి 103వ జయంతి సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, తాటి వెంకటేశ్వర్లు తదితర నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత ఎన్టీఆర్ అని నాయకులు కొనియాడారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అశ్వాపురంలో ఘనంగా ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు

### ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీబీ డైరెక్టర్



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 28 (వార్త సంధ్య) :** మహానాయకుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) గారి 103వ జయంతి సందర్భంగా అశ్వాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీబీ డైరెక్టర్ తుళ్ళూరి బ్రహ్మయ్య గారు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, కొబ్బరికాయలు కొట్టి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ సేవలను స్మరించుకుంటూ ఆయన తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ సదర్ లాల్, ఉప సర్పంచ్ తుళ్ళూరి ప్రకాష్ రావు, మాజీ ఎంపీటీసీ తుళ్ళూరి గంగా భవాని, మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత, ముత్తినేని వాసు, టిడిపి వాసు, రాయల సత్యనారాయణ, సాయిన్ని సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎన్టీఆర్ అభిమానులు, పార్టీ కార్యకర్తలు, సహచర గణం భారీ ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తదనంతరం ఎన్టీఆర్ చిత్రపటం ముందు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టి అభిమానులు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అశ్వాపురం మండల తెలుగుదేశం పార్టీ అభిమాన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు.

## ఆదివాసుల ఇలవేల్పుల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 28 (వార్త సంధ్య) :** అశ్వాపురం మండలంలోని గొండిగూడెం గ్రామంలో నిర్వహించిన బాపనమ్మ చంద్రపాల (బాలరాజు) ఆదివాసుల ఇలవేల్పుల పండుగ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదివాసుల సంప్రదాయాలు, సంస్కృతి, పూర్వీకుల ఆచారాలను కాపాడుకోవడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. ఆదివాసీ సంస్కృతి పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, మహిళలు సంప్రదాయ నృత్యాలు చేస్తూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలతో కలిసి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, బాబు, తుక్కాని మధుసూదన్ రెడ్డి, బూరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వేములపల్లి రమేష్, జి. నరేష్, సర్పంచ్‌లు కోండ్రు అంజమ్మ, ఏనిక ఉషారాణి, మచ్చా నరసింహారావు, ఉపసర్పంచ్ ఎడమ సురేష్, ఏనిక రవి, ఆవుల రవి, చుంచు ఏకాంబరం, సోడే వెంకటేశ్వర్లు, వేముల విజయ్, నూకల సంపత్ కుమార్, మడకం సారయ్య, తాటి రాంబాబు, కాపా సుభద్ర, గొంది రామారావు, కోండ్రు రామచంద్రయ్య, బెజ్జంకి వెంకటాచారి, బట్టి వెంకన్న, ముమ్మడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఎల్బీనగర్ నియోజకవర్గం లో హెచ్.ఎం.సీ. మరియు పోలీస్ అధికారులు మీసేవ కేంద్రాన్ని మరియు కమ్యూనిటీ హాల్ నీ మార్చడానికి ప్రయత్నం చేస్తున్నారని కాలనీవాసులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది

**ఎల్బీనగర్ ప్రతినిధి, మే 28 (వార్త సంధ్య):** చైతన్యపురి డివిజన్‌లోని వికాస్ నగర్ కాలనీలో ఉన్న మీ సేవ భవనాన్ని పోలీస్ స్టేషన్ కోసం,అలాగే న్యూ దిల్‌సుఖ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌ను మీసేవా కార్యాలయం కోసం ఉపయోగించేందుకు జీ.హెచ్.ఎం.సీ. మరియు పోలీస్ అధికారులు ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కి మొరపెట్టుకున్నారు.దీనిపై వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి కాలనీకి చేరుకుని డీసీ శ్రీనివాస్ ని పిలిపించి,దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ మీసేవ కార్యాలయానికి ఇవ్వబోమని స్పష్టం చేశారు.కాలనీవాసులకు అండగా తాను నిలబడతానని హామీ ఇచ్చి జోనల్ కమిషనర్‌తో కూడా మాట్లాడారు.అనంతరం మీసేవ,వార్డ్ ఆఫీస్ వద్దకు వెళ్లి తాళం వేయడం జరిగింది.మీసేవ కమిషనర్ రవికిరణ్‌తో కూడా మాట్లాడి కాలనీవాసులకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ విట్టల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, న్యూ దిల్‌సుఖ్‌నగర్ కాలనీవాసులు సుష్మిత, రోజా పద్మిని, భవాని నగర్ కాలనీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వికాస్ నగర్ కాలనీ అధ్యక్షులు వెంకటేష్, శోభారాణి, పవన్ సంతోష్, తులసి కృష్ణ,గట్టు శ్రీను, రమణారెడ్డి, జలంధర్, కిరణ్, నరేష్, శ్రీధర్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూల్ దందాలు మొదలు..!

**జూన్ దగ్గరపడుతుండగా కార్పొరేట్ విద్యా దోపిడీకి తెర**

**ఐఐటీ ఫౌండేషన్ పేరుతో చిన్నారులపై ఫీజుల భారం**

**నర్సరీకే రూ.22 వేలు.. పుస్తకాలకు మరో రూ.5 వేలు**

**కొత్తగూడెంలో మోత మోగిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలు**

**ప్రభుత్వ పాఠశాలల్లో జీతాలు ఎక్కువ.. అడ్మిషన్లు తక్కువ**

**ప్రైవేట్ స్కూళ్లలో జీతాలు తక్కువ.. అయినా సీట్లు ఫుల్**

**తప్పెవరిది..? ప్రభుత్వానిదా.. తల్లిదండ్రులదా..?**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 28 (వార్త సంధ్య) :** విద్య అంటే ఒకప్పుడు జ్ఞానం, విలువలు, భవిష్యత్తు. కానీ ఇప్పుడు అది పూర్తిస్థాయి వ్యాపారంగా మారిపోయిందనే విమర్శలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జూన్ నెల సమీపిస్తుండగా కొత్తగూడెం పట్టణంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఫీజుల దందా మళ్లీ మొదలైంది. అడ్మిషన్ల పేరుతో వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా "ఐఐటీ ఫౌండేషన్", "ఒలింపియాడ్ ట్రైనింగ్", "స్మార్ట్ ఎడ్యుకేషన్", "కాన్సెప్ట్ స్కూలింగ్" వంటి పేర్లతో చిన్నారుల భవిష్యత్తును బంగారు భవిష్యత్తుగా చూపిస్తూ భారీ మొత్తాలు వసూలు చేస్తున్న తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

**నర్సరీకే భారీ ఫీజులు..! :**

కొత్తగూడెంలోని కొన్ని కార్పొరేట్ స్కూళ్లలో నర్సరీ క్లాస్‌కే రూ.22 వేల వరకు ఫీజులు తీసుకుంటున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. దీనికి అదనంగా పుస్తకాలు, యూనిఫామ్‌లు, బూట్లు, బ్యాగులు, యాక్టివిటీ ఫీజులు, బస్ ఛార్జీలు పేర్లతో మరో భారీ భారం మోపుతున్నారని వాపోతున్నారు. కేవలం పుస్తకాలకే రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం పాఠ్యపుస్తకాల ధరలు నియంత్రించాలని, అధిక ధరలకు అమ్మకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రకటించినప్పటికీ ఆ నిబంధనలు ప్రైవేట్ పాఠశాలలకు వర్తించవా అనే ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి వస్తున్నాయి. కొందరు స్కూళ్లు ప్రత్యేకంగా తమ దగ్గరే పుస్తకాలు కొనాలని ఒత్తిడి తెస్తున్నాయని, బయట కొనుగోలు చేసే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు.

**చిన్నారుల పై ఐఐటీ భారం..! :**

ఇంకా అక్షరాలు కూడా పూర్తిగా రాని చిన్నారులకు "ఐఐటీ ఫౌండేషన్" పేరుతో ప్రత్యేక సెక్షన్లు ఏర్పాటు చేసి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొదటి తరగతి నుంచే పోటీ పరీక్షల పేరుతో పిల్లలపై మానసిక ఒత్తిడి పెంచుతున్నారని అంటున్నారు. పిల్లల బాల్యాన్ని ఆటలు, సృజనాత్మకత, విలువల విద్యతో తీర్చిదిద్దాల్సిన సమయంలో మార్కుల యంత్రాలుగా మార్చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. "ఐఐటీ ఫౌండేషన్" పేరుతో నిజంగా విద్య అందిస్తున్నారా..? లేక తల్లిదండ్రుల భయాన్ని వ్యాపారంగా మార్చు కుంటున్నారా..? అనే చర్చ జరుగుతోంది.

**ప్రభుత్వ విద్య పై నమ్మకం తగ్గిందా..? :**

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు గ్రామీణ ప్రాంతాల్లో విద్యకు కేంద్ర బిందు వులుగా ఉండేవి. కానీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రభుత్వ ఉపాధ్యా యులకు నెలకు రూ.30 వేల నుంచి లక్షల వరకు జీతాలు చెల్లిస్తున్నప్పటికీ చాలా పాఠశాలల్లో అడ్మిషన్లు తగ్గిపోతున్నాయి. మరోవైపు ప్రైవేట్ స్కూళ్లలో పనిచేసే టీచర్లకు రూ.10 వేల నుంచి రూ.15 వేల మధ్యే జీతాలు ఇస్తున్నప్పటికీ అక్కడ అడ్మిషన్లు మాత్రం ఫుల్ అవుతున్నాయి. దీన్ని చూస్తే తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకం కోల్పోతున్నారా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చాలా మంది తల్లిదండ్రులు "ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్య ఉన్నా, ఇంగ్లీష్ మాట్లాడే వాతావరణం లేదు", "డిసిప్లిన్ లేదు", "పిల్లల భవిష్యత్తుపై భరోసా లేదు" అనే భావనతో అప్పులు చేసి అయినా ప్రైవేట్ స్కూళ్లను ఆశ్రయిస్తున్నారని తెలుస్తోంది.

**ప్రకటనల మాయలో తల్లిదండ్రులు..? :**

కార్పొరేట్ విద్యాసంస్థలు భారీ హోర్డింగులు, టాపర్ ప్రకటనలు, 100% ఫలితాల ప్రచారంతో తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. "ఈరోజు అడ్మిషన్ తీసుకుంటే ప్రత్యేక రాయితీ", "సీట్లు పరిమితం", "ఇంటిగ్రేటెడ్ ఫౌండేషన్" అంటూ భయపెట్టి అడ్మిషన్లు పూర్తి చేస్తున్నాయని విమర్శలు ఉన్నాయి. చిన్న పిల్లల ఫోటోలు, టాపర్ ర్యాంకులు, ఎయిర్ కండిషన్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ బోధన పేర్లతో విద్యను పూర్తిగా కార్పొరేట్ మార్కెట్‌గా మార్చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


**తప్పు ఎవరిది..? :**


ఇక్కడ అసలు ప్రశ్న ఒక్కటే. ప్రభుత్వం నాణ్యమైన విద్య అందించడంలో విఫలమైందా..?

లేక కార్పొరేట్ విద్యాసంస్థల మాయలో పడుతున్న తల్లిదండ్రులదా తప్పు..? ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మౌలిక వసతులు, ఇంగ్లీష్ మాధ్యమం, నైపుణ్య ఉపాధ్యాయులు, టెక్నాలజీ ఆధారిత బోధన, క్రమశిక్షణ, బాధ్యతాయుత పర్యవేక్షణ ఉంటే తల్లిదండ్రులు ఎందుకు లక్షలు ఖర్చు పెట్టి ప్రైవేట్ స్కూళ్లకు పరుగులు పెడతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ :**

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణపై ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని, ప్రతి స్కూల్ ఫీజు నిర్మాణాన్ని ప్రజలకు వెల్లడించాలని, పుస్తకాలు, యూనిఫామ్‌లపై బలవంతపు అమ్మకాలను అరికట్టాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేలా సంస్కరణలు తీసుకురావాలని, ఉపాధ్యాయుల బాధ్యత పెంచాలని, కార్పొరేట్ విద్యా దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్య వ్యాపారం కాకుండా హక్కు అన్న భావన తిరిగి రావాలంటే ప్రభుత్వం, సమాజం, తల్లిదండ్రులు కలిసి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.



# భౌ... భౌ... వామ్మో కుక్కలు




**గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు**

**రాత్రివేళ బయటకు రావాలంటేనే ప్రజల్లో భయం**

**పిల్లలు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఆందోళనలో**

**విధుల నుంచి వస్తున్న వ్యక్తిపై కుక్కల దాడి యత్నం**

**సమయస్ఫూర్తితో తప్పిన ప్రమాదం**

**వీధి కుక్కల బెడదపై స్థానికుల ఆగ్రహం**

**సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకొస్తామని కార్పొరేటర్ హామీ**

**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 28 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 60వ డివిజన్ పరిధిలో వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరుగుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గల్లీల్లో 10 నుంచి 15 వరకు కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలపైకి ఎగబడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రాంతంలో చిన్నపిల్లలు బయట ఆడుకోవడానికి కూడా భయపడుతున్నారని, మహిళలు, వృద్ధులు రాత్రి సమయంలో బయటకు రావడానికి జంకుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల బైక్‌లపై వెళ్లేవారిని వెంటాడడం, నడుచుకుంటూ వెళ్లేవారిపై దాడి చేయడానికి ప్రయత్నించడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక వ్యక్తి రాజేష్ మాట్లాడుతూ, తాను విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ఒక్కసారిగా కుక్కల గుంపు తనపైకి దూసుకొచ్చిందని తెలిపారు. సమయానికి చేతిలో రాయి దొరకడంతో వాటిని తరిమికొట్టగలిగానని, లేకపోతే ప్రమాదం జరిగి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలను ఫోటోలు కూడా తీశానని చెప్పారు. వీధి కుక్కల భయంతో పిల్లలను బయటకు పంపేందుకు తల్లిదండ్రులు కూడా భయపడుతున్నారని, రాత్రి వేళల్లో ఉద్యోగాల నుంచి ఇంటికి వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వీధి కుక్కలను పట్టుకుని ప్రజలకు రక్షణ కల్పించాలని డివిజన్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇట్టి విషయంపై 60వ డివిజన్ కార్పొరేటర్ భీమా శ్రీవల్లి స్పందిస్తూ, సమస్యపై ఇప్పటికే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కుక్కలు ఎక్కువగా రాత్రి వేళల్లో మాత్రమే బయటకు వస్తుండటంతో అధికారులు వాటిని పట్టుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అయితే తప్పకుండా ఒకటి రెండు రోజుల్లో సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకువస్తామని ఆమె ప్రజలకు హామీ ఇచ్చారు.





# సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలి

**త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ**

**కలిసిమెలిసి ఉంటూ మతసామరస్యాన్ని చాటాలి**

**గోవును జాతీయ జంతువుగా**

**ప్రకటించాలనే మైనార్టీ సోదరుల ఆలోచన ఆదర్శం**

**మైనార్టీలపై జరుగుతున్న దాడులను ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు**

**అందరి శ్రేయస్సు కోరుతూ జరుపుకునే పండుగ ఇది**

**సమైక్యతతోనే దేశం మరింత ముందుకు సాగుతుంది**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 28 (వార్త సంధ్య) :** త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను అందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, సమాజంలో ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని తకొత్తగూడెం శాసనసభ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని బోడగుట్ట ఏరియాలో ఉన్న ఈద్గాను ఆయన సందర్శించి, అక్కడ జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లిం సోదర కుటుంబాలను కలిసి వారికి పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాలు వెల్లివిరియాలని, అందరూ సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు. దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని, మైనార్టీలపై దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు లాంటివని, సమాజంలో శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని మైనార్టీ సంఘం నాయకుడు కోరడం అత్యంత అభినందనీయమని, ఇది ముస్లింల ఉదార స్వభావానికి నిదర్శనమని శ్లాఘించారు. ఈ ప్రతిపాదనను తాము పూర్తిగా స్వాగతిస్తున్నామని, ఇలాంటి ఆలోచనలు సమాజంలో మతసామరస్యాన్ని మరింత పెంపొందిస్తాయని ఆయన స్పష్టం చేశారు. పండుగ రోజున అందరి శ్రేయస్సు కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి, మైనార్టీ సంఘాల నాయకులు నయీమ్ ఖురేషి, అబిద్ హుస్సేన్, అబ్దుల్ రబ్, అన్వార్ పాషా, యాసీన్, ఎండి యూసుఫ్, ఖమర్, ఫారూఖ్, అమీర్ ఖాద్రి, ఇస్మాయిల్, షకీల్, ఇమ్రాన్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## భారతరత్న నందమూరి తారకరామారావు గారి 103వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.




**ఎల్బీనగర్ ప్రతినిధి, మే 28 (వార్త సంధ్య):** భారతరత్న నందమూరి తారకరామారావు గారి 103వ జయంతి సందర్భంగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వనస్థలిపురం పనామా వద్ద ఉన్న ఎన్టీఆర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత, ప్రముఖ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ గారి సేవలను స్మరించుకున్నారు. ప్రజా సేవలోనూ, సినీ రంగంలోనూ ఎన్టీఆర్ గారు చూపిన మార్గం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, పలు డివిజన్ల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## చైతన్యపురి డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి






**ఎల్బీనగర్ ప్రతినిధి, మే 28 (వార్త సంధ్య):** వికాస్ నగర్ కాలనీలో ఉన్న మీసేవ భవనాన్ని పోలీస్ స్టేషన్‌గా, అలాగే న్యూ దిల్‌సుఖ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌ను మీసేవ కార్యాలయంగా ఉపయోగించేందుకు జీహెచ్ఎంసీ మరియు పోలీస్ అధికారులు ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కి తెలియజేయగా, వెంటనే స్పందించిన ఆయన కాలనీకి చేరుకుని అధికారులతో చర్చించారు. డీసీ శ్రీనివాస్ ని పిలిపించి, దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ మీసేవ కార్యాలయానికి ఇవ్వబోమని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన తాను ఎల్లప్పుడూ నిలబడతానని హామీ ఇస్తూ జోనల్ కమిషనర్‌తో పాటు మీసేవ కమిషనర్ రవికిరణ్ తో కూడా మాట్లాడి కాలనీవాసులకు భరోసా కల్పించారు. అనంతరం మీసేవ, వార్డ్ ఆఫీస్‌ల వద్దకు వెళ్లి తాళాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ విట్టల్ రెడ్డి , బీఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి న్యూ దిల్‌సుఖ్‌నగర్ కాలనీవాసులు సుష్మిత, రోజా పద్మిని, భవాని నగర్ కాలనీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వికాస్ నగర్ కాలనీ అధ్యక్షులు వెంకటేష్, శోభారాణి, పవన్ సంతోష్, తులసి కృష్ణ, గట్టు శ్రీను, రమణారెడ్డి, జలంధర్, కిరణ్, నరేష్, శ్రీధర్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ప్రపంచ కప్-2026 షూటింగ్‌లో అసాధారణ ప్రతిభ కనబరిచి చారిత్రాత్మక విజయం సాధించిన ఇషా సింగ్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 28 :** మ్యూనిచ్‌లో జరుగుతున్న వరల్డ్ కప్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో 43 హిట్స్ సాధించి అద్భుతమైన స్కోర్‌తో ప్రపంచ రికార్డును బద్దలు కొట్టిన ఇషా, సాధించిన విజయం భారత షూటింగ్ క్రీడా చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఇషా సింగ్ తన అంకితభావం, క్రమశిక్షణ పట్టుదలతో లక్షల మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని ప్రశంసించారు. ఆమె అద్భుతమైన ప్రదర్శన భారత క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని, భారత క్రీడల ఉజ్వల భవిష్యత్తుకు నిదర్శనమని అన్నారు. ఇషా సింగ్ భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించాలని, ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఆమె దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

## తెలుగువారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన ధీశాలి ఎన్టీఆర్

**రూ. 2 కే కిలో బియ్యం, జనతా వస్త్రాలు వంటి పథకాలు చారిత్రాత్మకం**

**ఎన్టీఆర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**

**పాత కొత్తగూడెం లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 28 (వార్త సంధ్య) :** సినిమా, రాజకీయ రంగాల్లో తెలుగువారి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన ధీశాలి ఎన్టీఆర్ అని, ఆయన ప్రవేశపెట్టిన రూ. 2 కే కిలో బియ్యం, జనతా వస్త్రాలు వంటి పథకాలు చారిత్రాత్మకమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు గురువారం పాతకొత్తగూడెంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ కలిసి అక్కడ ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్టీఆర్ పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహనీయుడని కొనియాడారు. నాడు ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని గుర్తుచేశారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళుగా భావించి పనిచేసిన ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, రామారావు, భవానీప్రసాద్, సాంబిరెడ్డి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## హేతువాద ఉద్యమ ప్రముఖుడు కామ్రేడ్ క్రాంతికార్‌కు విప్లవ జోహార్లు

**హేతువాద ఉద్యమానికి తీరని లోటు**

**నక్సల్బరీ ఉద్యమంతో ప్రజా పోరాటాల్లో కీలక పాత్ర**


**'హేతువాదం' పత్రిక సంపాదకుడిగా విశేష సేవలు**

**పుస్తకాలతో ప్రజల్లో చైతన్యం నింపిన ప్రజా మేధావి**

**మత మౌఢ్యాలకు వ్యతిరేకంగా నిరంతర పోరాట యోధుడు**

**ఖమ్మం విప్లవ, హేతువాద ఉద్యమాల తొలి తరం నాయకుడు**

**ప్రజా ఉద్యమాల్లో చెరగని ముద్ర వేసిన కామ్రేడ్ క్రాంతికార్**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 28 (వార్త సంధ్య):** హేతువాద ఉద్యమ ప్రముఖుడు, తొలితరం విప్లవకారుడు కామ్రేడ్ క్రాంతికార్ (డా. డామాబు లక్మయ్య) మరణం పట్ల సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం--ఖమ్మం సంయుక్త జిల్లా కమిటీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. తీవ్రమైన అస్వస్థతతో ఖమ్మంలోని ఆరాధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం ఆయన కన్నుమూశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ ఆయనకు విప్లవ జోహార్లు అర్పిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపింది. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినపల్లి గ్రామంలో జన్మించిన క్రాంతికార్ విద్యార్థి దశలోనే నక్సల్బరీ విప్లవోద్యమం వైపు ఆకర్షితులయ్యారు. 1970 దశకంలో 'నక్సల్బరీ' మాసపత్రిక నిర్వహణలో కీలక పాత్ర పోషించారు. 1972లో విరసం తొలి మహాసభ ఖమ్మంలో నిర్వహించబడగా, ఆ సభ విజయవంతానికి విశేష కృషి చేశారు. డా. కోవూర్‌తో కలిసి 1980 దశకంలో హేతువాద ఉద్యమ విస్తరణకు కృషి చేసిన ఆయన, మూఢనమ్మకాల నిర్మూలన కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారు. నిప్పుల మీద నడక వంటి మూఢాచారాలపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ హేతువాద సభలను నిర్వహించారు. 'హేతువాదం' పత్రిక సంపాదకుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. ఖమ్మంలో హోమియో వైద్యుడిగా సేవలందించిన క్రాంతికార్ నియమబద్ధమైన జీవితం గడిపారు. పుస్తక పఠనం, రచనలపై ప్రత్యేక ఆసక్తి కలిగిన ఆయన అనేక గ్రంథాలను రచించారు. మత మౌఢ్యాలకు వ్యతిరేకంగా పోరాడుతూ పలుమార్లు జైలు జీవితం కూడా అనుభవించారు. జిల్లాలో ఎక్కడ సభలు జరిగినా హేతువాద పుస్తకాల ప్రదర్శనతో ప్రజల్లో చైతన్యం నింపిన క్రాంతికార్ ఉమ్మడి రాష్ట్ర ప్రజలకు సుపరిచితుడిగా నిలిచారు. ఆయన జీవిత సహచరి ఝాన్సీ రాణి రిటైర్డ్ లెక్చరర్‌గా పనిచేశారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కామ్రేడ్ క్రాంతికార్ మరణం ప్రజా ఉద్యమాలకు, హేతువాద ఉద్యమానికి తీరని లోటని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సంయుక్త జిల్లా కమిటీ పేర్కొంది.

## ప్రపంచానికే తలమానికంగా "ఫ్యూచర్ సిటీ"

**ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం**

**కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు**




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే. 28. :** ప్రపంచానికే తలమానికంగా ఉండేలా "ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్ రెడ్డి, డి .శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం నాడు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఓ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి ప్రతిష్టాత్మక "ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి నిర్మాణంలో ఉన్న ఫ్యూచర్ సిటీ డెవలప్ మెంట్ అథారిటీ కార్యాలయ భవనం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ఫ్యూచర్ సిటీ" ప్రాజెక్టును ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ ప్రారంభోత్సవాన్ని కి సంబంధించిన తేదీల పై గౌరవ ముఖ్యమంత్రి గారితో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో తీసుకునే ప్రతి నిర్ణయం, ప్రతి నిర్మాణం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం వేస్తున్న పునాదులు రాబోయే తరాలకు ఆధునిక తెలంగాణ నిర్మాణానికి నాంది పలుకుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపే నగరంగా ఫ్యూచర్ సిటీ ఎదగాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని, గ్లోబల్ ప్రెజెన్స్ కలిగిన అనేక ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఇక్కడి నుంచే నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. యువతకు ప్రపంచ స్థాయి నైపుణ్యాలు అందించాలనే లక్ష్యంతో "యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ" ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ నిర్మాణాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని వేగవంతంగా ముందుకు తీసుకెళ్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎదురైన అనేక సవాళ్లను అధిగమిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ తెలంగాణకే కాకుండా దేశానికే తలమానికంగా నిలిచే ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటోందని, ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది యువతకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగ భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాలు, రాష్ట్రాలు సైతం ఆలోచించని విధంగా తెలంగాణ అభివృద్ధికి ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం తాత్కాలిక క్యాంపస్‌లో కొనసాగుతున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, పనుల పురోగతిని సమీక్షించి అవసరమైన నిర్ణయాలు తీసుకుని నిర్మాణాన్ని మరింత వేగవంతం చేస్తామని తెలిపారు. అనంతరం మంత్రులు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శ్రీ కె. శశాంక, ఐఏఎస్, మహేశ్వరం డీసీపీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## రైతుల పక్షపాతి మంత్రి శ్రీధర్ బాబు

**రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం**

**బిజెపి నేతల ఆరోపణ అవాస్తవం**

**డిసిసి అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్**



**మంథని, మే28( వార్త సంధ్య ) :** రాష్ట్రంలోని రైతులందరి సంక్షేమమే లక్ష్యంగా తమ కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పెద్దపల్లి డిసిసి అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్ స్పష్టం చేశారు. రైతు భరోసా పర్యటనలో భాగంగా మంథనిలో పర్యటించిన బిజెపి నాయకులు తమ నేత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పై కాంగ్రెస్ ప్రభుత్వం పై చేసిన ఆరోపణలు తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా తమ ఉనికిని చాటు కోవడం కోసం బిజెపి నాయకులు చేసిన ఆరోపాలు అవాస్తవమన్నారు. మంథని నియోజకవర్గం తో పాటు రాష్ట్రంలోని రైతులందరికీ సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారని, వారి కోసం ఎరువులు, విత్తనాలు, సాగు నీరు అందుబాటులో ఉంచుతూ ఆదుకుంటున్నారన్నారు. పండించిన పంటలకు మద్దతు ధర చెల్లించడంతోపాటు అదనంగా మరో రూ. 500 బోనస్ చెల్లిస్తూ రైతులను ఆదుకుంటున్నారన్నారు. ప్రకృతి వైపరీత్యాల నేపథ్యంలో కురిసే అకాల వర్షాలతో తడిసిన రంగు మారిన ధాన్యాన్ని సైతం తమ ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి ఆదుకుంటామని ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, ఐటీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబులు ప్రకటించిన విషయం బిజెపి నాయకులకు తెలియకపోవడం విచారకరమన్నారు. రైతులకు అందుబాటులో గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలను కల్పించిందన్నారు. అక్కడక్కడ ఉన్న చిన్న సమస్యలను భూతద్దంలో పెట్టి చూపడం కాదు అన్నారు. బిజెపి నాయకులు ఎన్నడు రైతుల పక్షాన నిలబడి మాట్లాడింది కానీ వారిని ఆదుకున్న తీరు చరిత్రలో లేదన్నారు. ఇప్పటికైనా రాజకీయానికి కోసం బిజెపి నేతలు తమ ప్రభుత్వాన్ని బదనాం చేయడం మానుకోవాలన్నారు.

## తెలుగుజాతి పౌరుషాన్ని దశదిశలా వ్యాపింపజేసిన మహనీయుడు ఎన్టీఆర్: బండి రమేష్




**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** తెలుగుజాతి పౌరుషాన్ని, ఆత్మగౌరవాన్ని ప్రపంచవ్యాప్తంగా దశదిశలా వ్యాపింపజేసిన ధీశాలి, నందమూరి తారక రామారావు గారి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ ఎన్టీ రామారావు గారి 103వ జయంతి వేడుకలను గురువారం నియోజకవర్గవ్యాప్తంగా వీధి వీధినా, వాడవాడలా అభిమానులు, పార్టీ కార్యకర్తలతో పాటు కాంగ్రెస్ నాయకులు సైతం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్స్, ద్విచక్ర వాహనాల ర్యాలీలు, రక్తదాన, అన్నదాన శిబిరాలతో కూకట్‌పల్లి పరిసర ప్రాంతాలు ఎన్టీఆర్ నామస్మరణతో మారుమోగాయి. కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని బండి రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా శిబిర నిర్వాహకులు వెంకట్రావును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు గరికపాటి రామ్మోహన్ రావు సైతం హాజరయ్యారు. వసంత నగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి బండి రమేష్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చిన టీడీపీ అభిమానులు, స్థానికులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ప్రగతి నగర్‌తో పాటు ఎన్టీఆర్ ఘాట్ వద్ద జరిగిన జయంతి వేడుకల్లో బండి రమేష్ పాల్గొని, జోహార్ ఎన్టీఆర్ అంటూ నివాళులు అర్పించారు. ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో రాజకీయ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొని అన్నగారి సేవలను స్మరించుకున్నారు.

## ఘనంగా బక్రీద్ ప్రార్థనలు

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఈద్గా వద్ద ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో గౌరవ పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ , మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులందరికీ ఆయన బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ... బక్రీద్ కేవలం ఒక పండుగ మాత్రమే కాదు అని, అది అచంచలమైన దైవభక్తికి, నిస్వార్థ త్యాగానికి నిదర్శనమని పేర్కొన్నారు. అల్లా పట్ల ప్రవక్త ఇబ్రహీం చూపిన అచంచల విశ్వాసాన్ని స్మరించుకుంటూ ఈ పండుగను జరుపుకుంటారని తెలిపారు. బక్రీద్ పండుగ మత సామరస్యానికి ప్రతీక. త్యాగానికి ప్రతిరూపంగా నిలిచే ఈ పవిత్రమైన రోజున సమస్త మానవాళికి శాంతి, సౌభాగ్యాలు చేకూరాలని అల్లాను ప్రార్థిస్తున్నాను. ముస్లిం సోదరులంతా ఈ పండుగను కుటుంబ సభ్యులు, స్నేహితుల మధ్య చక్కటి వాతావరణంలో, అత్యంత సంతోషంగా మరియు విజయవంతంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ ప్రార్థనా కార్యక్రమాలలో ముస్లిం మత పెద్దలు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు, స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.1.50కోట్లతో చింతల చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు

**చెరువును మరింత ఆధునీకరించి, సుందరంగా తీర్చిదిద్దుతాం**

**ప్రాంత ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా ప్రణాళికలు**

**చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 28 (వార్త సంధ్య) :** చుంచుపల్లి మండల, విద్యానగర్ పంచాయతీ పరిధిలోని చింతల చెరువు చుట్టూ రూ. 1.50కోట్లతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కృషి జరుగుతోందని, ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపి అనుమతులు మంజూరు చేయించడం జరిగిందని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గురువారం ఆయన చింతల చెరువును క్షేత్రస్థాయిలో సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతల చెరువును మరింత ఆధునీకరించి, అద్భుతంగా సుందరీకరిస్తామని తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు ఎంతగానో ఉపయోగపడే విధంగా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. స్థానికులకు మెరుగైన వసతులు కల్పించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి మురళి, సర్పంచి శాంతి శ్రీ, భాగం నాగమణి, మాధవరావు, తాటి కృష్ణవేణి, ఏపూరి కృష్ణమూర్తి, కె రామారావు, కృష్ణ, నర్సింహారావు, సురేష్, గంగయ్య, భద్రం, ప్రసాద్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ మంథని నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు







**మంథని, మే 28(వార్త సంధ్య ) :** మంథని పట్టణంలోని నృసింహ శివ కిరణ్ గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మంథని నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, రాబోయే పార్టీ కార్యక్రమాలు, గ్రామ స్థాయి నుండి పార్టీ నిర్మాణాన్ని మరింత బలపర్చే అంశాలపై నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. అలాగే మంథని నియోజకవర్గ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ ) మరియు పార్టీ తరపున నిర్వహించనున్న సిర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) ప్రక్రియ విధి విధానాలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్ఏ ల బాధ్యతలు, ఓటరు జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో చేర్చడం, తప్పుల సవరణ, డూప్లికేట్ మరియు అనర్హ ఓట్ల గుర్తింపు వంటి కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. అదేవిధంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పులు, తొలగింపులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంటింటి పరిశీలన సమయంలో బీఎల్ఏ లు పాటించాల్సిన విధానాలపై చర్చించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని, సిర్ ప్రక్రియలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని దుద్దిల్ల శ్రీను బాబు సూచించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేయడంలో బీఎల్ఏ లు కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు. అలాగే సర్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. మంథని నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై ప్రత్యేక దృష్టి సారించాలని దుద్దిల్ల శ్రీను బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏ లు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లా కేంద్రంలోని యశోద హాస్పిటల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ ఆదిత్య గుండె వైద్యంలో వస్తున్న ఆధునిక మార్పులపై వివరాలు వెల్లడించారు.




కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 28( వార్త సంధ్య ) : ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె జబ్బుల చికిత్సలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో రోగులకు మరింత సురక్షితమైన మరియు సమర్థవంతమైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా సర్జరీ అవసరం లేకుండానే గుండె వాల్వ్ మార్పిడి చేసే "టావి" విధానం 60 ఏళ్లు దాటిన వృద్ధులకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. అలాగే తక్కువ 'డై' వినియోగంతోనే యాంజియోగ్రామ్ ప్రొసీజర్ నిర్వహించే సాంకేతికత ప్రస్తుతం అందుబాటులో ఉందని తెలిపారు. దీని వల్ల కిడ్నీ సమస్యలు ఉన్న రోగులకు కూడా సురక్షితంగా పరీక్షలు నిర్వహించవచ్చని చెప్పారు. గుండె వైద్యంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ముందస్తు పరీక్షలు, సరైన చికిత్సతో గుండె జబ్బులను అధిగమించవచ్చని డాక్టర్ ఆదిత్య సూచించారు. యశోద హాస్పిటల్స్ ఆధునిక వైద్య సదుపాయాలతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు.

# కూకట్‌పల్లి అనన్య హాస్పిటల్‌లో ఘోరం

### గాల్‌బ్లాడర్ ఆపరేషన్ జరిగిన రెండ్రోజులకే రోగి మృతి

### ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన.. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** సొంత కాళ్లపై నడుచుకుంటూ ఆసుపత్రికి వచ్చిన ఒక పేషెంట్, వైద్యుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగా శవమై ఇంటికి చేరిన విషాద ఘటన కూకట్‌పల్లిలోని అనన్య హాస్పిటల్‌లో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం... ఉమ్మల్ల మల్లయ్య అనే వ్యక్తి గాల్‌బ్లాడర్ సమస్యతో ఈ నెల 26న అనన్య హాస్పిటల్‌లో చేరారు. అదే రోజు వైద్యులు ఆయనకు ఆపరేషన్ నిర్వహించారు. అయితే, శస్త్రచికిత్స పూర్తయినప్పటి నుండి మల్లయ్య తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ వచ్చారు. ఈ విషయమై కుటుంబ సభ్యులు వైద్యులను సంప్రదించగా, "ఆపరేషన్ తర్వాత అలానే ఉంటుంది.. మేమేం చేయలేం" అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. రెండో రోజు కూడా మల్లయ్య నొప్పి భరించలేక విలవిలలాడుతుండటంతో బంధువులు పదే పదే డాక్టర్లను బ్రతిమాలారు. కాగా, రోగి బాధను పట్టించుకోకపోగా, పదే పదే అడుగుతున్నారంటూ వైద్యులు బంధువులపై చిరాకు పడ్డారు. సరైన సమయంలో స్పందించి చికిత్స అందించకపోవడంతో, తీవ్రమైన నొప్పితో నరకం అనుభవించిన మల్లయ్య గురువారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో ప్రాణాలు కోల్పోయారు. మల్లయ్య మృతి చెందడంతో హాస్పిటల్ యాజమాన్యం తమకేమీ సంబంధం లేదన్నట్లుగా ప్రవర్తించింది. ఆయనకు గుండెపోటు రావడం వల్లే చనిపోయాడని చెబుతూ చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేసింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మల్లయ్య చనిపోయాడంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహంతో ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాని విజయవంతం చేయండి:పిడమర్తి రవి




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 28 :** జూన్ 21న ఇంద్ర పార్క్ లో నిర్వహించే తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు వనపర్తి పట్టణ కేంద్రంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశం ఉద్యమకారుల ఉమ్మడి జిల్లా అధ్యక్షులు ఉల్యంకొండ రాములు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం మరియు ఉద్యమకారులకు గుర్తింపు కార్డు అదేవిధంగా పింఛన్ ఇవ్వాలని ప్రధాన డిమాండ్లతో జూన్ 21న చేపట్టిన ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు హాజరవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల రాష్ట్ర ఉపాధ్యక్షులు చీర్ల సత్యం, ఓయు జేఏసీ అధ్యక్షులు ఎండిరహీం, అన్వర్ పి యు జేఏసీ నాయకులు, ప్రజా వాగ్గేయకారులు రాజారాం ప్రకాష్, తెలంగాణ గాంధీ యాదగిరి, టీ జె ఎస్ జిల్లా అధ్యక్షులు ఖాదర్ పాషా, దీూఖీ రాష్ట్ర అధ్యక్షులు బోరెల్లి సురేష్, ముప్పారం కుమార్, రోడ్డ నిరంజన్, మీసాల మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకూ మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేస్తాం

### రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు

### ఇసుక రవాణా వాహనాలను ధాన్యం కొనుగోలుకు వినియోగించాలి

### డిఫాల్ట్ రైస్ మిల్లులు బకాయిలు చెల్లిస్తే ధాన్యం కేటాయింపు

### మే నెలాఖరులోగా యాసంగి కొనుగోళ్లు పూర్తి చేయాలి

### ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన మంత్రి ఉత్తమ్






**పెద్దపల్లి జిల్లా ప్రతిని, మే 28( వార్త సంధ్య) :** ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం పెద్దపల్లి ఐడిఓసీలో నిర్వహించిన యాసంగి ధాన్యం కొనుగోళ్ల సమీక్ష సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు గత ప్రభుత్వంతో పోలిస్తే 25 నుంచి 30 శాతం అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, 8 లక్షల మంది రైతులకు రూ. 11 వేల కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. 15 నుంచి 17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ఎలాంటి కోతలు లేకుండా పూర్తి మద్దతు ధరతోనే కొనుగోలు చేసి బాయిలర్ మిల్లులకు తరలిస్తామని తెలిపారు. మిల్లర్లకు ఏవైనా నష్టాలు వచ్చినా ప్రభుత్వం భరిస్తుందని, రైతులకు మాత్రం నష్టం జరగనివ్వమన్నారు. రైతుల చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. గతంలో డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులు బకాయిలు, వడ్డీలు చెల్లిస్తే తిరిగి ధాన్యం కేటాయింపులు ఇస్తామని తెలిపారు. రాబోయే 4 నుంచి 5 రోజుల పాటు ఇసుక రవాణా నిలిపివేసి వాహనాలను పూర్తిగా ధాన్యం రవాణాకు వినియోగించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సుమారు 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తుండగా, ఎఫ్‌సీఐ కేవలం 51 లక్షల మెట్రిక్ టన్నులకే పరిమితమైందన్నారు. ఎఫ్‌సీఐ కేటాయింపులకు మించి అదనంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. డిసెంబర్ 2023 తర్వాత కనీస మద్దతు ధర విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తూ రైతులకు ఇప్పటివరకు అదనంగా రూ. 16,479 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం వర్షాల కారణంగా కేవలం 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే తడిసిందని, ఆ ధాన్యాన్ని కూడా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్నామని తెలిపారు. అవసరమైతే అదనపు గోదాములు అద్దెకు తీసుకుంటామని చెప్పారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదు సార్లు ధాన్యం కొనుగోళ్లు జరిగినప్పటికీ ఎక్కడా ఒక్క కిలో ధాన్యానికి కూడా తరుగు పేరుతో కోత విధించలేదన్నారు. జిల్లాలో ఎక్కడైనా రైతుల నుంచి ఒక్క కేజీ ధాన్యం తరుగు తీసినట్లు తెలిసినా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా మిల్లర్ల చేత రైతులకు పరిహారం ఇప్పిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు మాట్లాడుతూ ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దఎత్తున ధాన్యం పెద్దపల్లికి వస్తోందని, అందుకు అనుగుణంగా రైస్ కేటాయింపులు పెంచాలని కోరారు. రైతులను ఇబ్బంది పెట్టే మిల్లులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలో యాసంగిలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు రూ. 788 కోట్ల విలువైన 3.32 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. జూన్ 5 నాటికి 100 శాతం కొనుగోళ్లు పూర్తి చేస్తామని వెల్లడించారు. ఆన్‌లైన్ ఎంట్రీలు, ట్రక్ షీట్ జనరేషన్, రైతుల చెల్లింపుల్లో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. జిల్లాలో 6.9 లక్షల మెట్రిక్ టన్నుల మిల్లింగ్ సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 5.7 లక్షల మెట్రిక్ టన్నులు వినియోగంలో ఉన్నాయని, ఇంకా 1.2 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం అందుబాటులో ఉందన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లు కూడా సమర్థవంతంగా కొనసాగుతున్నాయని, ఇప్పటివరకు 22 వేల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేసి అవసరమైన నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. యాసంగి సీజన్ లో లక్షా 60 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 185 కోనుగోలు కేంద్రాల ద్వారా 65 వేలు మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భూపాలపల్లి జిల్లాకు సంబంధించి పెద్దపల్లిలో 20 వేల వరంగల్ లో 20 వేల మెట్రిక్ టన్నుల, హన్మకొండ లో 10 వేల మెట్రిక్ టన్నులు మిల్లింగ్ కొరకు పౌరసరఫరాల శాఖ అలాట్మెంట్ చేసిందని తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో హార్వెస్టింగ్ కొన్ని ప్రాంతాలలో ఆలస్యంగా జరుగుతుందని, చాలా మండలాలో ఇంకా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావాల్సి ఉందని అన్నారు. మంత్రి ఆదేశాల మేరకు 100 మట్టి, ఇసుక రవాణా వాహనాలను కూడా ధాన్యం కొనుగోళ్ల కోసం వినియోగిస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి జిల్లాలో స్టోరేజీ ప్లేస్ తక్కువగా ఉన్నందున ఇతర జిల్లాల మిల్లులకు కూడా ట్యాగ్ చేయాలని కోరారు. అంతకుముందు పెద్ద కలవల్ల ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి గంగయ్య సురేష్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్ జిల్లా సహకార అధికారి శ్రీమాల, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిని కాలిందిని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి సంబంధిత అధికారులు రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# రిటేడ్ ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మే 28 :** టి జీ ఆర్ టి సి జేఏసీఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రాజకీయ ప్రధాన సలహాదారులు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి నివాసం లో వీరితో పాటు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘు రామ్ రెడ్డి నీ కలిసి జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న వైస్ చైర్మన్ థామస్ రెడ్డి, కో కన్వీనర్ యాదగిరి, బాబు,బుద్ద విశాల్, రవికిరణ్, లు కలిసి ప్రస్తుతశీ ఆర్టీసీ విలీనం గురించి జరుగుతున్న పరిణామాలపై క్షుణ్ణంగా వివరించి యూనియన్ ఎన్నికలకంటే ముందుగా జూన్ 2 తేదీన విలీనంకై అపాయింటెడ్ డేట్ ప్రభుత్వం ప్రకటించే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం తగిన నిధులను విడుదల చేయాలని, విలీనంపై పలు అంశాలను పొందపరిచి వినతిపత్రం ద్వారా కోరారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకుల ను ఉద్దేశించి వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను తప్పకుండా నిలబెట్టుకుంటుందని స్పష్టత ఇవ్వడం జరిగింది. అలాగే జూన్ 2 తేదీన అపాయింటెడ్ డేట్ ప్రకటన గురించి, విలీన విధి విధానాలకోసం అధికారులు, మరియు కార్మిక సంఘాలతో కమిటి వేసి, విలీనం సక్రమంగా చేపించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఆంధ్రాలో ఆర్టీసీ ఉద్యోగులకు జరిగిన నష్టం తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు జరుగకుండా కార్మిక సంఘాలు, అధికారులు , తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు అలగే విలీనంతో ఆర్టీసీ కార్మికులకు మేలు చేయాలని సీఎం భావిస్తున్నారని అందుకు సక్రమంగా,సజావుగా విలీనం జరగడానికి నావంతు ప్రయత్నం చేస్తానని భరోసా ఇవ్వడం జరిగింది. విలీనం గురించి కార్మికుల్లో



ప్రస్తుతం నెలకొన్న గందరగోళ పరిస్థితుల గురించి పూర్తి వివరాలు జేఏసీ నాయకులు వివరిస్తున్నపుడు ఎంతో ఓపికతో తన అమూల్యమైన సమయాన్ని వెచ్చించి సావధానంగా విని ఆర్టీసీ కార్మికుల మనోభావాలను చిరకాల ఆకాంక్షను సహృదయం తో అర్థం చేసుకొని విలీనశీపై స్పష్టమైన హామీ ఇచ్చినందుకు యావత్ ఆర్టీసీ కార్మికుల పక్షాన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము - టి జి ఎస్ ఆర్టిసి జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న. వైస్ చైర్మన్ థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య. కో కన్వీనర్ సుద్దాల సురేష్, కో కన్వీనర్ దీ యాదగిరి.

# కవి గంటా రామకృష్ణకు "ఎన్టీఆర్ సేవా రత్న" పురస్కారం




**హైదరాబాద్ (సికింద్రాబాద్), వార్త సంధ్య :** తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక, నట దిగ్గజం, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో పురస్కార ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. యువ ఆర్ట్ థియేటర్స్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు "ఎన్టీఆర్ సేవా రత్న", "ఎన్టీఆర్ నంది" పురస్కారాలను ప్రదానం చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా నర్సిపురం గ్రామానికి చెందిన ప్రముఖ కవి, రచయిత గంటా రామకృష్ణ తన సామాజిక, సాహిత్య సేవలకు గాను ప్రతిష్టాత్మక "ఎన్టీఆర్ సేవా రత్న" పురస్కారానికి ఎంపికయ్యారు. హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రముఖ సినీ నటుడు మరియు ఆంధ్రప్రదేశ్ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సుమన్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. గంటా రామకృష్ణ గత 20 ఏళ్లుగా ఉపాధి హామీ పథకంలో సాంకేతిక సహాయకుడిగా విధులు నిర్వహిస్తూ, ఉద్యోగ సంఘ నాయకుడిగా, కవిగా, రచయితగా తనదైన గుర్తింపు పొందారు. సాహిత్య రంగంతో పాటు మానసిక నిపుణుడిగా, యోగా న్యాయనిర్ణేతగా కూడా సమాజానికి సేవలు అందిస్తూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా గంటా రామకృష్ణ మాట్లాడుతూ తన ఆరాధ్య దైవం ఎన్టీఆర్ పేరుతో ప్రముఖుల సమక్షంలో ఈ పురస్కారం అందుకోవడం జీవితంలో మరచిపోలేని అనుభూతి అని ఆనందం వ్యక్తం చేశారు. ఆయనకు ఈ పురస్కారం లభించడం పట్ల పార్వతీపురం మన్యం జిల్లా ప్రజలు, సాహితీ ప్రియులు, ఉద్యోగ సహచరులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు

# అంతర్రాష్ట్ర జలవివాదాలు.. కెన్-బెట్వా ప్రాజెక్టును ఉదహరించిన ప్రధాని మోదీ

### జలవివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని సూచన

### సకాలంలో అనుమతులు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ ద్వారా సమస్యలను అధిగమించాలన్న మోదీ

### ఆయా రాష్ట్రాల్లోని రూ.30 వేల కోట్ల అభివృద్ధి పనులపై సమీక్ష



అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక సూచన చేశారు. ఈ మేరకు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. జల వివాదాలను సహకార ధోరణితో పరిష్కరించుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. సకాలంలో అనుమతులు, సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ ద్వారా ఈ సమస్యలను అధిగమించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన కెన్-బెట్వా ప్రాజెక్టు నమూనాను ఉదహరించారు. భారతదేశంలో మొట్టమొదటి నదుల అనుసంధాన ప్రాజెక్టు కెన్-బెట్వా ప్రాజెక్టు. మధ్యప్రదేశ్‌లోని కెన్ నదిలో ఉన్న అదనపు జలాలను కాలువ ద్వారా ఉత్తరప్రదేశ్‌లోని బెట్వా నదికి మళ్లిస్తారు. ఈ నేపథ్యంలో మోదీ మాట్లాడుతూ, రాష్ట్రాల మధ్య నీటి సమస్యల పరిష్కారానికి ఇది ఆదర్శ మోడల్‌గా పేర్కొన్నారు. ప్రధాని మోదీ కెన్ - బెట్వా నదుల అనుసంధాన ప్రాజెక్టు సహా ఆయా రాష్ట్రాల్లో రూ. 30 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల అమలులో జాప్యం, ఖర్చుల పెరుగుదలకు దారితీయడమే కాకుండా, పౌరులకు అవసరమైన సౌకర్యాలను సకాలంలో అందకుండా చేస్తుందని మోదీ వ్యాఖ్యానించారు. నీటి భద్రత కోసం నదుల అనుసంధానం, జల సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవం వంటి అంశాల్లో అవకాశాలను గుర్తించాలని సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ - అర్బన్ 2.0ను కూడా సమీక్షించారు. ఆయా నగరాల్లో రూఫ్ టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు మార్గాలను అన్వేషించాలని అన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చురుకుగా పనిచేయాలని ప్రధాని మోదీ సూచించారు.

# జూన్ 12 నుంచి ఇంటర్ కాలేజీల్లో బ్రేక్‌ఫాస్ట్ స్కీం






**వారం రోజులకు రుచికరమైన మెనూ**

**ఇంటర్ విద్యార్థులకు పోషకాలతో కూడిన రుచికరమైన అల్పాహారం**

**జూన్ 12న సీఎం చేతుల మీదుగా అల్పాహార కార్యక్రమం ప్రారంభం**

ఇంటర్ విద్యార్థులకు పోషకాలతో కూడిన రుచికరమైన అల్పాహారం ఇవ్వాలని తెలంగాణ సర్కారు నిర్ణయించింది. దోశ, పూరి, మిల్లెట్ ఇడ్లీతో పాటు వెజిటబుల్ కుర్మా అందించనునట్టు ప్రకటించింది. జూన్ 12న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్న భోజనం, బ్రేక్ ఫాస్ట్‌కు కలిపి ఏడాదికి రూ.180 కోట్లను ఖర్చు చేయనున్నారు. ఈ పథకం ద్వారా 1.9 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.దోశ, పూరి, బోండా, మిల్లెట్ ఇడ్లీ! ఇది ప్రభుత్వం ఇంటర్ కళాశాలల్లో అందించనున్న బ్రేక్‌ఫాస్ట్ పథకంలోని మెనూ. ఇంటర్మీడియట్ దశలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన బలవర్ధక ఆహారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించడంతో ఇంటర్ విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా విద్యార్థులకు పోషకాలతో కూడిన రుచికరమైన ఆహారం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు వారం రోజుల పాటు అందించే మెనూని విడుదల చేసింది. తొలి రోజు దోశ, చట్నీ, రెండో రోజు మిల్లెట్ ఇడ్లీ, సాంబారు, మూడో రోజు పూరీ, మిక్స్‌డ్ వెజిటెబుల్ కుర్మా, నాలుగో రోజు బోండా, చట్నీ, అయిదో రోజు ఇడ్లి, చట్నీ, ఆరో రోజు ఉప్మాతో పాటు చట్నీ లేదా సాంబార్ అందించనున్నారు. రోజు విడిచి రోజు 150 మిల్లీ లీటర్ల పాలు అందిస్తారు. ఇక వీటికితోడు మరింత పోషకాలు అందించే వివిధ ఇతర పదార్థాలను పరిశీలిస్తునట్టు సమాచారం.

**ఇంటర్ కళాశాల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం :**

| వారం | మెనూ |
|---|---|
| సోమవారం | దోశ, చట్నీ |
| మంగళవారం | మిల్లెట్ ఇడ్లి, సాంబారు |
| బుధవారం | పూరీ, మిక్స్‌డ్ వెజిటెబుల్ కుర్మా |
| గురువారం | బోండా, చట్నీ |
| శుక్రవారం | ఇడ్లి, చట్నీ |
| శనివారం | ఉప్మా, చట్నీ లేదా సాంబారు |

ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా సర్కారు నిర్ణయం : గ్రామాలు, తండాలు, ఆదివాసీ గూడేల నుంచి విద్యార్థులు ఇంటర్ చదివేందుకు దూర ప్రాంతాలకు వెళ్లే క్రమంలో అర్థాకలితోనే చదువుని కొనసాగిస్తున్నారని ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల్లో చదివే విద్యార్థుల్లో అత్యధికులు బలహీనవర్గాలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారే అని సర్వే గణాంకాలు చెబుతున్నాయి. ఆయా కుటుంబాల్లోని ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా పదో తరగతి తరువాత చదువుని కొనసాగించడం కష్టంగా మారుతోందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో పదో తరగతి పూర్తి చేసిన ప్రతి విద్యార్థి ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలని నిర్ణయించుకున్న సర్కారు ఇంటర్మీడియట్ విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తోంది.జూన్ 12న ఈ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారు. తొలి రోజు 64 కళాశాలలో మొత్తం 41,250 మంది విద్యార్థులు ఈ పథకంలో భాగస్వాములవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తి స్థాయిలో తరగతులు ప్రారంభమైన తర్వాత ఫస్టియర్, సెకండియర్ కలిపి రోజుకు 1.92 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం అందించనున్నారు. అల్పాహారానికి రూ.80 కోట్లు, మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం రూ.100 కోట్లను కేటాయించనుంది. ఈ పథకం అమలుతో దేశంలోనే తొలిసారి ఇంటర్మీడియట్ విద్యార్థులకు అల్పహారం, మధ్యాహ్న భోజనం అందించనున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ అవతరించనుంది. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాల ద్వారా తెలంగాణలో ఉన్న ప్రతి బిడ్డ, ప్రతి బాలిక, ప్రతి విద్యార్థి కలలకు జీవం పోసే దిశగా అడుగులు వేస్తుంది. తెలంగాణలో విద్యార్థులు ఎదిగితే తెలంగాణ రాష్ట్రం కూడా ఉన్నత స్థాయిలో ఎదుగుతుందనే ఉద్దేశంతో ఈ ప్రభుత్వం విద్యార్థుల పోషణ, విద్యా ఫలితాలను మెరుగుపరచడానికి వీలుగా ఈ రెండు పథకాలకు ఇటీవల తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో ప్రవేశ పెట్టిన సంగతి తెలిసిందే.

# ఏపీలో 457 కి.మీ. హైస్పీడ్ రోడ్ కారిడార్

**మారనున్న ఏజెన్సీ ప్రాంతాల ముఖచిత్రం**

**కోల్‌కతా-చెన్నై హైవేకు ప్రత్యామ్నాయంగా ఖరగ్‌పూర్ అమరావతి మార్గం నిర్మాణం**

**మోర్త్ సూచించిన 3 ఎలైన్‌మెంట్లలో 'ఏజెన్సీ' మార్గానికే రాష్ట్రం మొగ్గు**

**మొత్తం 1,107 కి.మీ.లలో ఏపీలో 457 కి.మీ.**



సరకు రవాణా వేగంగా సాగేలా పశ్చిమ బెంగాల్‌లో ఖరగ్‌పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వరకు నిర్మించతలపెట్టిన హైస్పీడ్ రోడ్ కారిడార్ మన రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల మీదుగా వెళ్లనుంది. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) మొత్తం మూడు ఆప్షన్లను సూచించింది. అందులో ఏజెన్సీ ప్రాంతాన్ని ఎక్కువగా కవర్‌చేసేలా ఉన్న ఎలైన్‌మెంట్‌కు కూటమి ప్రభుత్వం ప్రాథమికంగా అంగీకారం తెలిపింది. ఈ 4 వరుసల కారిడార్‌కు ఆనుకొని అనేక ప్రాంతాలు అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఎన్‌హెచ్-516కి సమాంతరంగా కోల్‌కతా-చెన్నై మధ్య ప్రస్తుతమున్న ఎన్‌హెచ్-16లో ఖరగ్‌పూర్ నుంచి విజయవాడ సమీపంలో అమరావతి ఔటర్ రింగ్‌రోడ్ వరకు హైవేను హైస్పీడ్ కారిడార్‌గా మార్చేలా సూచించారు.

**ఆప్షన్ 2:** ఇందులో పశ్చిమబెంగాల్, ఒడిశాలలోని బహరగోరా, ఝూర్ఖండ్, భంజనగర్, కామాఖ్యనగర్, పద్మాపూర్ మీదుగా రాష్ట్రంలోకి ప్రవేశించి పార్వతీపురం, కురుపాం, సాలూరు, పాడేరు, చింతపల్లి, గోకవరం, మక్కువ, అరకు, కన్నాపురం, కామవరపుకోట, ద్వారకా తిరుమల, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, నూజివీడు మీదుగా ఆగిరిపల్లి సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌లో కలుస్తుంది.

**ఆప్షన్ 3:** ఖరగ్‌పూర్ నుంచి పశ్చిమబెంగాల్, ఝూర్ఖండ్, ఒడిశా మీదుగా వచ్చి ఏపీ సరిహద్దులో కుంట మీదుగా చింతూరు, చింతలపూడి, కుకునూరు, విస్సన్నపేట మీదుగా మైలవరం సమీపంలో అమరావతి ఔటర్ రింగ్ రోడ్‌ను కలిసేలా ప్రతిపాదించారు.ఇందులో రెండో ఆప్షన్ ఎలైన్‌మెంట్‌కు రాష్ట్రప్రభుత్వం సమ్మతి తెలిపింది. ఇది విజయనగరం-రాజమహేంద్రవరం మధ్య ఏజెన్సీ ప్రాంతాల మీదుగా విస్తరణ పనులు జరుగుతున్న 'ఎన్‌హెచ్-516ఇ'కి అనేక చోట్ల సమాంతరంగా వెళు_ంది.ప్రాజెక్ట్‌కు రూ.75,629 కోట్లు అవుతుందని అంచనా : రాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలిపిన మార్గం మొత్తం 1,107 కి.మీ. (పశ్చిమబెంగాల్‌లో 65 కి.మీ., ఝూర్ఖండ్- 63, ఒడిశా - 522, ఏపీలో 457 కి.మీ.). ఇందులో 1,057 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ ఉంది. అలాగే ఆంధ్రప్రేదశ్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 202 కి.మీ., పార్వతీపురం మన్యం జిల్లాలో 116 కి.మీ., ఏలూరు జిల్లాలో 111 కి.మీ., తూర్పుగోదావరి జిల్లాలో 28, మేరకు ఉంటుంది. ఈ కారిడార్ ప్రస్తుతమున్న కోల్‌కతా-చెన్నై హైవేకు గరిష్ఠంగా 120 కి.మీ., కనిష్ఠంగా 20 కి.మీ., దూరం నుంచి వెళ్లనుంది.అలాగే గంటకు 100 నుంచి 120 కి.మీ. వేగంతో వాహనాలు వెళ్లేలా దీన్ని నిర్మించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రాజెక్ట్‌కు రూ.75,629 కోట్లు అవుతుందని అంచనా ఉంది. ఇందులో సివిల్ పనుల విలువ రూ.66,648 కోట్లు ఉండనుంది. ఈ ప్రాజెక్టు కోసం 2,371 హెక్టార్ల అటవీ భూములు, 10,603 హెక్టార్ల ఇతర భూములు సేకరించాల్సి ఉంటుంది. వీటికి రూ.8,982 కోట్ల వ్యయమవుతుంది. ఈ హైస్పీడ్ కారిడార్ నిర్మాణంలో సగటున కి.మీ.కు రూ.68.32 కోట్లు ఖర్చవుతుందని అంచనా.

**ఇవీ ప్రయోజనాలు :**

సరకు రవాణాలో వేగం పెరగనుంది.

కోల్‌కతా-చెన్నై హైవే-16కు ప్రత్యామ్నాయ హైవే కావడంతో ఎన్‌హెచ్-16పై ఒత్తిడి తగ్గుతుంది.

విశాఖపట్నం-రాయ్‌పూర్ యాక్సెస్ కంట్రోల్ హైవేని సాలూరు సమీపంలో ఈ హైస్పీడ్ కారిడార్ క్రాస్ చేస్తుంది. ఈ హైవేలో వచ్చే వాహనాలు ఈ కారిడార్‌లోకి చేరుకొని అటు ఖరగ్‌పూర్ వైపు, ఇటు అమరావతి వైపు రాకపోకలు సాగించే వీలుంది.అనేక కొత్త ప్రాంతాలు, ఏజెన్సీ మీదుగా కారిడార్ వెళ్లనుండటంతో అక్కడ అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంది.అరకు, పాడేరు, లంబసింగి వంటి ప్రాంతాలకు పర్యాటకులు పెరిగేందుకు దోహదపడుతుంది.

# 'మహానాడు' చరిత్రలో తొలిసారి ఓ ట్రాన్స్‌జెండర్‌కు వేదికపై మాట్లాడే అవకాశం

**మహానాడులో తొలిసారి ట్రాన్స్ జెండర్‌కు మాట్లాడే అవకాశం**

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఎమ్మెల్యే గాల్లా మాధవి పీఏ ట్రాన్స్ జెండర్ వర్షిణీ ప్రసంగం**

**అవకాశం ఇవ్వడం ఎంతో గర్వకారణంగా ఉందన్న వర్షిణీ**

మహానాడులో తొలిసారి ట్రాన్స్ జెండర్‌కు మాట్లాడే అవకాశం లభించింది. ఎమ్మెల్యే గాల్లా మాధవి పీఏ ట్రాన్స్ జెండర్ వర్షిణీ ప్రసంగం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇంత పెద్ద కార్యక్రమంలో తన లాంటి ట్రాన్స్ జెండర్స్‌కు అవకాశం ఇవ్వడం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నానని వర్షిణీ అన్నారు. చీకటి రాజ్యంలో మూలిగి పోయిన తమ బతుకుల్లో వెలుగులు నింపిన నాయకుడు చంద్రబాబు అని వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ ప్రభుత్వం తీసుకొని గొప్ప నిర్ణయం తెలుగుదేశం ప్రభుత్వం తీసుకొందని ప్రసంసించారు.ట్రాన్స్ జెండర్స్‌కు గుర్తింపును ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అని ట్రాన్స్ జెండర్ వర్షిణీ అన్నారు. ట్రాన్స్ జెండర్స్‌కు సొంత ఇళ్లు, పింఛన్లు ఇచ్చి ఆర్థిక భరోసా కల్పించారని తెలిపారు. వెలుగులు వచ్చిన తమ జీవితాల్లో గత ప్రభుత్వం చీకటి నింపాలని చూసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో ప్రభుత్వం మారింది, మళ్లీ తమ జీవితాలు మార్పు మొదలైందన్నారు.తెలుగుదేశం ప్రభుత్వంలోనే టాన్స్ జెండర్స్ జీవితాలు మెరుగుపడ్డాయని వర్షిణీ వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలుగుదేశం ప్రభుత్వం స్టేట్ వెల్ఫేర్ ట్రాన్స్ జెండర్ బోర్డు ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. అందులో ట్రాన్స్ జెండర్‌కి అవకాశం ఇచ్చారన్నారు. పీఏగా అవకాశం కల్పించిన గల్లా మాధవికి ఎప్పటికీ రుణ పడి ఉంటానన్నారు." 2014-19లో ఏ రాజకీయ నాయకుడు చేయని గొప్ప ఆలోచన సీఎం చంద్రబాబు చేశారు. మాకోసం స్టేట్ వెల్ఫేర్ ట్రాన్స్ జెండర్ బోర్డు ఏర్పాటు చేశారు. మమ్మల్ని కూడా గుర్తించి, పెన్షన్లు, గృహాలు కల్పించారు. ఇలా వెలుగులు వచ్చిన మా జీవితాల్లో గత ప్రభుత్వం చీకటి నింపాలని చూసింది. రోజూ బాధ పడుతూ, కుంగిపోతున్న సమయంలో 2024లో రాష్ట్ర ప్రజలు గొప్ప రాజకీయ నిర్ణయం తీసుకున్నారు. అప్పుడు ప్రభుత్వం మారింది, మళ్లీ మా జీవితాలు మారాయి.మరోవైపు మహిళలను గౌరవించడం, మహిళలకు అవకాశం కల్పించడం, మహిళలకు ఆత్మస్థైర్యం ఇచ్చిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని మహిళ నేతలు స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ మహానాడు కార్యక్రమంలో మహిళా సాధికారతపై మహిళ నేతలు మాట్లాడుతూ, మహిళ అంటే ఒక వ్యక్తి కాదు, ఒక శక్తి, కుటుంబానికి ధైర్యం, సమాజానికి స్ఫూర్తి అని నమ్మింది మన తెలుగుదేశం పార్టీనేనని గుర్తు చేశారు.భారత ప్రజాస్వామ్య చరిత్రలో మహిళా సాధికారతకు 'నారీ శక్తి వందన్ అధినియం' (చట్టసభల్లో 33% మహిళా రిజర్వేషన్) ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలుస్తుందని మహిళ నేతలు అభిప్రాయపడ్డారు. ఇది కేవలం సంఖ్యాపరమైన మార్పు కోసం తెచ్చింది కాదు, దేశ విధానాల్లో మహిళల స్వరం బలంగా వినిపించేందుకు రాజకీయ నిర్ణయాల్లో వారికి సమాన భాగస్వామ్యం కల్పించేందుకు తెచ్చిన గొప్ప సంస్కరణ అని గుర్తు చేశారు.మహిళా సాధికారిత మాటల్లో కాదు, చేతల్లో చేసి చూపిన పార్టీ తెలుగుదేశం అని స్పష్టం చేశారు. మహిళ బలపడితే కుటుంబం బలపడుతుందని, తద్వారా సమాజం బలపడుతుందని బలంగా నమ్మే పార్టీ తెలుగుదేశం అని వివరించారు. అణిచివేసే ప్రయత్నం చేస్తే తెలుగుదేశం పార్టీలో యోధులు పుట్టుకొస్తారని గొడ్డలి పార్టీకి అర్థమై ఉంటుందన్నారు. ప్రత్యర్థుల దుష్ప్రచారాన్ని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ తిప్పికొట్టాలని మహానాడులో మహిళా నేతలందరూ పిలుపునిచ్చారు.




# గుజరాత్‌లో దారుణం: భార్య నచ్చలేదని రూ.50 వేలకు అమ్మేసిన భర్త




గుజరాత్‌లో అత్యంత దారుణ ఘటన వెలుగుచూసింది. భార్య నచ్చలేదనే కారణంతో కట్టుకున్న భర్తే ఆమెను రూ.50 వేలకు అమ్మేశాడు. ఈ అమానుష ఘటనలో బాధితురాలి భర్త నిఖేష్‌భాయ్ పటేల్‌తో పాటు మొత్తం ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బనస్కాంత జిల్లాలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.పోలీసుల వివరాల ప్రకారం మే 11న నిందితుడు నిఖేష్ పటేల్ తన భార్య కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే, రెండు రోజుల తర్వాత నిఖేష్ కూడా అదృశ్యం కావడంతో అతడి తండ్రి మరో ఫిర్యాదు చేశారు. ఈ వరుస పరిణామాలు పోలీసులకు అనుమానం కలిగించాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో లోతైన దర్యాప్తు చేపట్టారు.టెక్నికల్ సర్వైలెన్స్, మానవ వనరుల ద్వారా సమాచారం సేకరించిన పోలీసులు నిఖేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. తన భార్య ప్రవర్తన నచ్చకపోవడంతో, ఆమెను వదిలించుకోవాలనే ఉద్దేశంతోనే స్నేహితులైన సంజయ్ ఠాకూర్, అశోక్ ఠాకూర్, సచిన్ దర్బార్‌ల సహాయంతో అమ్మేసినట్లు ఒప్పుకున్నాడు.నిందితుల చెర నుంచి బాధితురాలిని పోలీసులు సురక్షితంగా కాపాడారు. తనను అమ్మేసిన తర్వాత ఒకచోట బంధించి, నిరంతరం లైంగిక దాడి చేశారని బాధితురాలు తన వాంగ్మూలంలో పేర్కొంది. అంతేకాకుండా, తన బంగారు ఆభరణాలను లాక్కొని అమ్మేశారని తెలిపింది. ఈ కేసులో పోలీసులు హ్యూమన్ ట్రాఫికింగ్, మోసం, నేరపూరిత కుట్ర వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.ప్రధాన నిందితుడు నిఖేష్ పటేల్‌కు ఇదివరకే పెళ్లయిందని, ఇతర మహిళలను లోబరుచుకోవడం, కిడ్నాప్ చేయడం వంటి నేర చరిత్ర ఉందని పోలీసులు గుర్తించారు. ఈ కోణంలో కూడా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ఎన్టీఆర్ జయంతి, ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్, పురందేశ్వరి నివాళులు

**ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ నివాళులు**

**ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నివాళులర్పించిన జూనియర్ ఎన్టీఆర్**





తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఉమ్మడి ఏపీ మాజీ సీఎం నందమూరి తారకరా మారావు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ నివాళులు అర్పించారు. తెలుగు ప్రజలకు ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రముఖుల రాక నేపథ్యంలో ఎన్టీఆర్ ఘాట్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.పురందేశ్వరి భావోద్వేగం: మరణం లేని జననం ఎన్టీఆర్‌దని రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అన్నారు. ఎన్టీఆర్ 103వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్‌లో ఆమె నివాళులర్పించారు. రాజకీయాలు అధికారం చెలాయించడానికి కాదు ప్రజాసేవకు ఎలా వినియోగించుకోవొచ్చో నందమూరి తారక రామారావు రుజువు చేశారని పురందేశ్వరి గుర్తు చేశారు. ఈ క్రమంలో పురందేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు.'తెలుగుజాతి ఉన్నంత వరకు చిరస్మరణీయంగా ఎన్టీఆర్ చిరంజీవుడుగానే ఉంటారని నేను నమ్ముతున్నాను. ఒక కథానాయడిగానే కాకుండా ప్రజాసేవలో ఎన్టీఆర్ తనదైన ముద్ర వేసుకున్నారు. రాజకీయాలు కేవలం అధికారం కోసమే కాకుండా ప్రజలకు సేవ చెయ్యడం, ఆపదలో ఉన్నవారికి అండగా నిలబడడానికని ఆయన రుజువు చేశారు. తారక రామారావు ఆశీర్వాదం తెలుగు వారికి ఎప్పుడూ ఉంటుంది.' - **పురందేశ్వరి, రాజమహేంద్రవరం ఎంపీ**

ఆయనో ప్రభంజనం: ఈ మూడు అక్షరాల పేరు ఒక ప్రభంజనం, ఒక సంచలనం. తెలుగువారి గుండెల్లో చెరగని ముద్ర వేసిన ఆ మహానటుడు ప్రజల గుండల్లో సజీవంగానే ఉంటాడంటూ పలువురు ఆయనను స్మరించుకుంటున్నారు.


# గోల్కొండ కోట వద్ద రోప్‌వే!

**హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యకు కొత్త పరిష్కారం**

**హైదరాబాద్‌లో వారణాసి మోడల్ అమలుకు కసరత్తు**

**తొలివిడతలో గోల్కొండ నుంచి టూంబ్స్ వరకు ఏర్పాటు**

**హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో యూనిఫైడ్ మెట్రోపాలిటిన్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ కార్యాచరణ**



సాధారణంగా రోప్‌వేలు కొండలు, పర్యాటక ప్రాంతాల వద్దే ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఇక నుంచి హైదరాబాద్ వంటి మహానగరంలో కూడా వీలైనన్నీ ప్రాంతాల్లో పర్యాటకంతో పాటు ప్రజారవాణాకు ఉపయోగపడేలా రోప్‌వేల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధమవుతోంది. దీని కోసం హైదరాబాద్‌లో వారణాసి మోడల్‌ను ప్రవేశపెట్టడానికి హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో యూనిఫైడ్ మెట్రోపాలిటిన్ ట్రాన్స్‌ఫోర్ట్ అథారిటీ (ఉమ్టా) కార్యాచరణ రూపకల్పన చేస్తోంది. అయితే దీనిలో భాగంగా అధికారులు విధానంలో మార్పులు కోరుతూ సర్కార్‌కి ప్రతిపాదనలు పంపారు.వారణాసి మోడల్ దేశంలోనే తొలి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు రోప్‌వే వాడుకునేందుకు పనులు చేపడుతున్నారు. హైదరాబాద్‌లో కూడా మెట్రో, రైల్వే స్టేషన్ల నుంచి సమీప వాణిజ్య, వ్యాపార సముదాయాలకు, ఒక పర్యాటక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి అనుసంధానం చేయడం దగ్గర దగ్గరగా ఉన్న పలు సందర్శనీయ ప్రాంతాలను కలుపుతూ రోప్‌వే సర్క్యూట్ ఏర్పాటు చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం.హైదరాబాద్‌లో ఎంతో చారిత్రక పర్యాటక ప్రాంతమైన గోల్కొండ పక్కనే ఉన్న టూంబ్స్ వరకు 2 కి.మీ.ల పరిధిలో హెచ్ఎండీఏ రోప్‌దేను పీపీపీ పద్ధతిలో ఏర్పాటుకు కార్యాచరణ రూపొందిస్తోంది. అక్కడ నుంచి జూ వరకు 6 కి.మీల పొడవు ( ఏరియల్ వ్యూ) రోప్‌వేతో అనుసంధానం చేసే సౌకర్యం ఉంది. మరోవైపు ట్యాంక్‌బండ్ నుంచి సంజీవయ్య పార్కు వరకు కూడా రోప్‌వే ప్రతిపాదనలున్నాయి. ఐటీ ప్రాంతంలోనూ వాడుకునే వీలుంది. ప్రైవేటు ఆస్తులపై నుంచి ఈ రోప్‌వే వెళ్తే పరిహారం అందించేలా పాలసీలో మార్పులు చేయనున్నారు. ఇప్పుడు ఏఎస్ఐ, రక్షణ శాఖల నుంచి ఎన్‌వోసీ కోసం హెచ్ఎండీఏ ప్రయత్నిస్తోంది. అక్కడ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత ప్రాజెక్టు పనులు షురూ కానున్నాయి.ప్రస్తుతం వారణాసి కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ నుంచి గోదౌలియా చౌక్ వరకు 3.8 కి.మీ.ల మేరకు రోప్‌వే పనులు కొనసాగుతున్నాయి. వీటి మధ్య మొత్తం 5 స్టేషన్లు ఉన్నాయి. రోజుకు 96 వేల మంది రాకపోకలు సాగించేలా డిజైన్ చేస్తున్నారు. రోడ్డు మార్గంలో ట్రాఫిక్‌ను తప్పించుకుంటూ వెళ్లాలంటే 45 నిమిషాల నుంచి గంట సమయం పడుతుంది. అదే రోప్‌వే అయితే కేవలం 16 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. హైదరాబాద్‌లోనూ ఇలా రోప్‌వేకు అనువైన ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. 2-3 కి.మీ.ల దూరానికి కూడా తీవ్ర ట్రాఫిక్ ఉంటోంది. వర్షాకాలమైతే వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇలా తక్కువ దూరానికి రోప్‌వేలు మేలని నిపుణులు చెబుతున్నారు. అలాగే భద్రత విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా టికెట్ ఖర్చు కూడా సామాన్యులకు అందుబాటులో ఉండేలా డిజైన్ చేస్తే మరింత ఉపయోగపడుతోంది.మరోవైపు తెలంగాణలో రోప్‌వే పర్యాటకం కూడా అతిత్వరలోనే అందుబాటులోకి రానుంది. భువనగిరి కోటను రూ.56.81 కోట్ల ఖర్చుతో అభివృద్ధి చేసేందుకు పర్యాటక సంస్థ ఇటీవల టెండర్ల ప్రక్రియ మొదలైంది. దీన్ని హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి నుంచి కోట వరకు కి.మీ దూరం రోప్ వే ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ఇదే మొదటి రోప్ వే కానుంది. అయితే ఈ కోటకు ట్రెక్కింగ్ ప్రాధాన్యమున్న ప్రాంతాల్లో ఈ కోటపైకి చేరడానికి దాదాపు గంట సమయం పడుతుంది. అదే రోప్‌వే ఏర్పాటు చేస్తే మెట్లు ఎక్కే సమస్య తప్పడంతో పాటు ఇది సరికొత్త అనుభూతిని ఇస్తుంది. భువనగిరి కోటతో పాటు యాదగిరిగుట్ట లక్ష్మినరసింహస్వామి, నల్గొండలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ ఆనకట్ట, మంథనిలోని రామగిరి కోట వరకు కూడా రోప్‌వే ఏర్పాటు చేస్తారు. నాగార్జునసాగర్ ఆనకట్ట మీదుగా 5 కి.మీ మేర రోప్ వే నిర్మించనున్నారు. మిగతావన్నీ 2 కిలోమీటర్ల మేర ఉన్నాయి.

# ప్రపంచ స్టాక్ మార్కెట్లలో భారత్‌కు షాక్

**ఇండియాను వెనక్కి నెట్టి ఐదో స్థానానికి తైవాన్!**

**ప్రపంచ స్టాక్ మార్కెట్ ర్యాంకింగ్స్‌లో భారత్ వెనుకంజ**

**ఏఐ, సెమీకండక్టర్ల జోరుతో దూసుకెళ్లిన తైవాన్ మార్కెట్**

**టీఎస్‌ఎంసీ షేర్ల దూకుడుతో పెరిగిన తైవాన్ మార్కెట్ విలువ**

**విదేశీ పెట్టుబడుల ఉపసంహరణతో ఒత్తిడిలో భారత మార్కెట్లు**




ప్రపంచ స్టాక్ మార్కెట్లలో భారత్‌కు అనూహ్యంగా ఎదురుదెబ్బ తగిలింది. మార్కెట్ విలువ పరంగా భారత్‌ను అధిగమించిన చిన్న దేశం తైవాన్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద స్టాక్ మార్కెట్‌గా అవతరించింది. బుధవారం ట్రేడింగ్‌తో తైవాన్ మార్కెట్ విలువ 5 ట్రిలియన్ డాలర్లకు చేరువ కాగా, భారత మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.92 ట్రిలియన్ డాలర్లకు పరిమితమైంది. దీంతో భారత్ ఆరో స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం ఈ జాబితాలో అమెరికా (77.95 ట్రిలియన్ డాలర్లు) అగ్రస్థానంలో ఉండగా, చైనా, జపాన్, హాంకాంగ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.తైవాన్ ఈ ఘనత సాధించడం వెనుక కృత్రిమ మేధ, సెమీకండక్టర్ల (చిప్) బూమ్ కీలక పాత్ర పోషించింది. ప్రపంచంలోనే అతిపెద్ద కాంట్రాక్ట్ చిప్ తయారీ సంస్థ అయిన 'తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ' (టీఎస్ఎంసీ) షేర్లు గత ఏడాదిలో 130 శాతం మేర పెరిగాయి. ఎన్విడియా, యాపిల్ వంటి టెక్ దిగ్గజాలకు ఏఐ చిప్‌లను సరఫరా చేస్తుండటంతో గ్లోబల్ ఇన్వెస్టర్లు తైవాన్ మార్కెట్‌పై భారీగా పెట్టుబడులు పెట్టారు.ఇదే సమయంలో భారత మార్కెట్లు పలు ప్రతికూలతలను ఎదుర్కొంటున్నాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, ఇంధన ధరల పెరుగుదల, రూపాయి క్షీణత వంటి కారణాలతో ఈ ఏడాది సెన్సెక్స్, నిఫ్టీలు 8 శాతం వరకు నష్టపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు నిధులను ఉపసంహరించుకోవడం కూడా ఒత్తిడి పెంచుతోంది. అయినప్పటికీ, దేశీయ రిటైల్ ఇన్వెస్టర్లు, మ్యూచువల్ ఫండ్ ఎస్ఐపీల రూపంలో వస్తున్న పెట్టుబడులు భారత మార్కెట్‌కు అండగా నిలుస్తున్నాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# రోజుకు రూ.550 కోట్ల నష్టాన్ని భరిస్తున్న ప్రభుత్వ చమురు సంస్థలు

**అంతర్జాతీయ ధరలు పెరిగినా సామాన్యుడికి ఊరట**

**ఇంధన ధరల స్థిరత్వం కోసం నష్టాన్ని భరిస్తున్న పీఎస్‌యూలు**

**రిటైల్ బంకుల వైపు మళ్లుతున్న పారిశ్రామిక కొనుగోళ్లు**

**అక్రమాలపై కఠిన చర్యలకు రాష్ట్రాలకు కేంద్రం ఆదేశం**

**దేశంలో ఇంధన కొరత లేదని, పుకార్లు నమ్మవద్దని సూచన**




అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, దేశీయంగా సామాన్యులపై భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు (పీఎస్‌యూలు) పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ అమ్మకాలపై రోజుకు సుమారు రూ.550 కోట్ల నష్టాన్ని భరిస్తున్నాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ బుధవారం వెల్లడించింది.పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ధరలు పెరిగాయి. అయినప్పటికీ, ఆ పెరిగిన ధరలను దేశీయ రిటైల్ మార్కెట్‌కు బదిలీ చేయకుండా వినియోగదారులకు ఉపశమనం కల్పిస్తున్నారు. ఈ ప్రయోజనం కేవలం సాధారణ గృహాలు, ద్విచక్ర వాహనదారులు, రైతుల వంటి రిటైల్ వినియోగదారులకు మాత్రమేనని, పారిశ్రామిక కొనుగోళ్లకు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది.అయితే, ఈ ధరల వ్యత్యాసం వల్ల కొత్త సమస్య తలెత్తింది. పారిశ్రామిక అవసరాల కోసం పెద్ద మొత్తంలో ఇంధనం కొనుగోలు చేసేవారు కూడా తక్కువ ధరకు లభించే రిటైల్ బంకులకు వస్తున్నారు. దీనివల్ల ప్రైవేట్ సంస్థల డీజిల్ అమ్మకాలు 38 శాతం పడిపోగా, ఆ భారం ప్రభుత్వ రంగ బంకులపై పడుతోంది. కొన్ని ప్రాంతాల్లో ఇది స్థానిక కొరతకు దారితీసే ప్రమాదం ఉందని మంత్రిత్వ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.ఈ పరిస్థితిని తీవ్రంగా పరిగణించిన కేంద్రం, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలను ఆదేశించింది. 'అత్యవసర వస్తువుల చట్టం' కింద చర్యలు చేపట్టాలని, ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేయాలని సూచించింది. సామాన్యుల కోసం ఉద్దేశించిన ఇంధనాన్ని పారిశ్రామిక అవసరాలకు మళ్లించవద్దని పరిశ్రమల సంఘాలకు కూడా హెచ్చరికలు జారీ చేసింది.దేశంలో పెట్రోల్, డీజిల్ నిల్వలకు ఎలాంటి కొరత లేదని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ భరోసా ఇచ్చింది. దేశీయ అవసరాలు తీరగా, భారత్ పెట్రోలియం ఉత్పత్తులను పెద్ద ఎత్తున ఎగుమతి కూడా చేస్తోందని గుర్తు చేసింది. దేశంలో సప్లై సమస్య లేదని, ధరల వ్యత్యాసం వల్ల కొరత ఏర్పడుతోందన్న పుకార్లను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది.

# కొత్త బిల్డింగ్ కడుతున్నారా... 2026లో ఇదే కొత్త ఫ్లోరింగ్ ట్రెండ్!

**ప్రీమియం ఇళ్లలో సాధారణ సిరామిక్ టైల్స్ వాడకం తగ్గింది**

**ఫ్లోరింగ్‌ను ఇప్పుడు లగ్జరీ అంశంగా పరిగణిస్తున్నారు**

**జ్యామితీయ డిజైన్లు, టెర్రాజో ఫ్లోరింగ్‌కు పెరుగుతున్న ఆదరణ**

**సీమ్‌లెస్ లుక్ ఇచ్చే మైక్రోసిమెంట్, మార్బుల్ ఇన్లేలకు మంచి డిమాండ్**

**ఫ్లోరింగ్ మన్నికతో పాటు అందానికి ప్రాధాన్యత ఇస్తున్న ట్రెండ్**



రియల్ ఎస్టేట్ రంగంలో ఇంటి నిర్మాణ శైలి వేగంగా మారుతోంది. ఒకప్పుడు ఫ్లోరింగ్ అంటే కేవలం సిరామిక్ లేదా విట్రిఫైడ్ టైల్స్ మాత్రమే గుర్తుకు వచ్చేవి. కానీ, 2026 నాటికి ఈ ట్రెండ్ పూర్తిగా పాతబడింది. ఇప్పుడు ప్రీమియం అపార్ట్‌మెంట్లు, విల్లాల్లో ఫ్లోరింగ్‌ను కేవలం ఒక ఆవశ్యకతగా కాకుండా, ఇంటికి రాజసం ఉట్టిపడే లగ్జరీ అంశంగా చూస్తున్నారు. అందం, మన్నిక, విభిన్నమైన డిజైన్లకు కొనుగోలుదారులు, డెవలపర్లు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.

**ప్రస్తుతం నాలుగు రకాల లగ్జరీ ఫ్లోరింగ్ ట్రెండ్స్ మార్కెట్‌లో బాగా ప్రాచుర్యం పొందాయి.**

1. వివిధ ఆకృతుల టైల్స్: ఆరు కోణాలు ఉండే టైల్స్, హెరింగ్‌బోన్, చెవ్రాన్ వంటి విభిన్న ప్యాటర్న్‌లతో కూడిన టైల్స్ హాల్, వంటగది, బాల్కనీలలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో ఫ్లోర్ రగ్గుల మాదిరిగా వీటిని అమర్చి ఇంటికి కొత్త అందాన్ని తెస్తున్నారు.

2. టెర్రాజో ఫ్లోరింగ్: పాతకాలం నాటి ఈ డిజైన్, ఆధునిక హంగులతో మళ్లీ ముందుకొచ్చింది. చిన్న చిన్న రాళ్ల మిశ్రమంతో నిండినట్లు కనిపించే ఈ ఫ్లోరింగ్ చాలా మన్నికైంది. దుమ్ము, ధూళిని అంత సులభంగా కనిపించనీయదు. భారతీయ వాతావరణ పరిస్థితులకు ఇది బాగా నప్పుతుంది.

3. మైక్రోటాపింగ్/మైక్రోసిమెంట్: ఇది టైల్స్ మధ్య గీతలు (గ్రౌట్ లైన్స్) లేకుండా, మొత్తం ఒకేలా కనిపించే సీమ్‌లెస్ ఫ్లోరింగ్. ప్రస్తుతం ఇది అత్యంత వేగంగా ఆదరణ పొందుతున్న ట్రెండ్. దీన్ని పాత టైల్స్ లేదా కాంక్రీట్ పైన కూడా వేయవచ్చు. ఇది ఇంటిని విశాలంగా, శుభ్రంగా కనిపించేలా చేస్తుంది.

4. మార్బుల్ ఇన్లే: ఆధునిక వాటర్‌జెట్ కటింగ్ టెక్నాలజీతో మార్బుల్‌పై మొఘల్ కాలం నాటి డిజైన్ల వంటి క్లిష్టమైన నమూనాలను చెక్కడం ఇప్పుడు సులభతరమైంది. విల్లాలు, ప్రవేశ ద్వారాలు, పూజ గదుల్లో ఈ ఇన్లే ఫ్లోరింగ్ ఇంటికి సంప్రదాయబద్ధమైన, విలాసవంతమైన లుక్‌ను ఇస్తుంది.

మొత్తం మీద, ఫ్లోరింగ్‌ను ఇప్పుడు ఇంటి విలువను పెంచే ప్రధాన ఆకర్షణగా పరిగణిస్తున్నారు. సాధారణ యూనిఫాం టైల్స్‌కు బదులుగా, ప్రత్యేకమైన డిజైన్లతో కూడిన ఫ్లోరింగ్‌తో ఇంటికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం ప్రస్తుత ట్రెండ్.

# బ్యాంకింగ్ షేర్లు ఢీలా..
# స్వల్ప నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ఒడుదొడుకుల మధ్య స్వల్ప నష్టాల్లో ముగిసిన మార్కెట్లు**

**బలహీనపడిన బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లు**

**142 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్**

**సూచీలు తగ్గినా లాభపడిన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు**



బుధవారం నాటి ట్రేడింగ్‌లో దేశీయ స్టాక్ మార్కెట్లు ఒడుదొడుకుల మధ్య స్వల్ప నష్టాలతో ముగిశాయి. ప్రధానంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి, అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఇన్వెస్టర్లను ఆచితూచి అడుగులు వేసేలా చేశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, 30 షేర్ల సెన్సెక్స్ 141.90 పాయింట్లు నష్టపోయి 75,867.80 వద్ద స్థిరపడింది. ఇక, నిఫ్టీ కూడా 6.55 పాయింట్ల స్వల్ప నష్టంతో 23,907.15 వద్ద ముగిసింది.అమెరికా, ఇరాన్ మధ్య సయోధ్యకు చర్చలు జరుగుతున్నప్పటికీ, మంగళవారం దక్షిణ ఇరాన్‌పై అమెరికా దాడులు చేసిందన్న వార్తలు అంతర్జాతీయంగా ఆందోళనలను పెంచాయి. ఈ పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీనికి తోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు అమ్మకాల వైపు మొగ్గు చూపడం కూడా ప్రతికూల ప్రభావం చూపింది.టెక్నికల్ పరంగా చూస్తే, నిఫ్టీకి 23,800 పాయింట్ల వద్ద కీలక మద్దతు ఉందని, ఒకవేళ ఈ స్థాయిని కోల్పోతే 23,600-23,500 స్థాయిల వరకు పతనం ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. అదే సమయంలో, 24,000-24,100 శ్రేణి బలమైన నిరోధకంగా ఉందని, దీనిని దాటితేనే బుల్స్ తిరిగి పట్టు సాధించగలరని పేర్కొన్నారు.నిఫ్టీలో ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ షేర్లు ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. మరోవైపు, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, ఎన్టీపీసీ షేర్లు 2 శాతానికి పైగా లాభపడగా.. టాటా స్టీల్, ఇండిగో, మారుతీ సుజుకీ, టైటాన్ కంపెనీ, ఏషియన్ పెయింట్స్ కూడా లాభాలతో ముగిశాయి. సూచీలు బలహీనంగా ఉన్నప్పటికీ, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ స్టాక్స్ రాణించడం విశేషం. రంగాలవారీగా చూస్తే ఫైనాన్షియల్ సర్వీసెస్, బ్యాంకింగ్ సూచీలు నష్టపోగా, మీడియా, మెటల్, ఆటో సూచీలు లాభపడ్డాయి.

# ముంబైలో మండుతున్న అద్దెలు



**సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్‌కు లక్ష దాటిన రెంట్**

**ముంబైలో సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్న ఇంటి అద్దెలు**

**సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ అద్దె రూ. 28 వేల నుంచి రూ. 1.10 లక్షల వరకు**

**ఆదాయానికి మించి అద్దెలు పెరగడంతో మధ్యతరగతి వర్గాలపై తీవ్ర భారం**

**దేశంలోనే అత్యంత ఖరీదైన రెంటల్ మార్కెట్‌గా ముంబై**

**పెరుగుతున్న డిమాండ్, పరిమిత సరఫరాయే అద్దెలు పెరగడానికి కారణం**

భారత ఆర్థిక రాజధాని ముంబైలో ఇంటి అద్దెలు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. 2026లో సింగిల్ బెడ్‌రూమ్ (1బీహెచ్‌కే) ఫ్లాట్ల అద్దెలు రికార్డు స్థాయిలో పెరిగి, మధ్యతరగతి వర్గాల ఆదాయానికి, ఇంటి ఖర్చుకు మధ్య వ్యత్యాసాన్ని భారీగా పెంచుతున్నాయి. ముఖ్యంగా ఉద్యోగాల కోసం నగరానికి వచ్చే వారికి సొంత గూడు అనేది అందని ద్రాక్షగా మారుతోంది.రియల్ ఎస్టేట్ అనలిటిక్స్ సంస్థ 'రియల్టీఎక్స్‌టీ' అందించిన వివరాల ప్రకారం ముంబైలోని ప్రాంతాలను బట్టి సింగిల్ బెడ్రూం ఫ్లాట్ అద్దెల్లో భారీ తేడాలు ఉన్నాయి. సబర్బన్ ప్రాంతమైన భాండూప్‌లో నెల అద్దె సుమారు రూ. 28,000 ఉండగా, కొలాబా వంటి ఖరీదైన దక్షిణ ముంబై ప్రాంతాల్లో ఇది ఏకంగా రూ. 1.10 లక్షల వరకు పలుకుతోంది. బాంద్రా, పరేల్, ప్రభాదేవి, మెరైన్ లైన్స్, దాదర్ వంటి ప్రాంతాల్లోనూ అద్దెలు చాలా ఎక్కువగా ఉన్నాయి. అంధేరీ వెస్ట్, గోరేగావ్, ములుండ్, కాందివలి వంటి సబర్బన్ ప్రాంతాల్లో కూడా అద్దెలు గణనీయంగా పెరిగాయి.నగరంలో పెరుగుతున్న ఉద్యోగావకాశాలు, మెరుగైన రవాణా సౌకర్యాలు, డిమాండ్‌కు తగినంతగా ఇళ్ల సరఫరా లేకపోవడం వంటివి అద్దెలు పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. ఆస్తుల ధరలు అధికంగా ఉండటంతో చాలామంది ఇళ్లు కొనడానికి బదులు అద్దెకు ఉండేందుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో రెంటల్ మార్కెట్‌పై ఒత్తిడి పెరుగుతోంది.దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే, ముంబైలోనే అద్దెలు అత్యంత ఖరీదైనవిగా ఉన్నాయని మార్కెట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ అద్దెల పెరుగుదలను నియంత్రించేందుకు ప్రభుత్వం నుంచి ఎలాంటి కొత్త ప్రకటనలు రాలేదు.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్




**భారీ ప్లాన్ తో రంగంలోకి బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్!**

**కొంపల్లిలో భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్ చేపట్టనున్న బ్రిగేడ్**

**5.6 ఎకరాల్లో అభివృద్ధి చేయనున్న ప్రీమియం వెంచర్**

**ఈ ప్రాజెక్టు ద్వారా రూ.850 కోట్ల ఆదాయం అంచనా**

**హైదరాబాద్‌లో విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఈ ఒప్పందం**

**రాబోయే 3-4 ఏళ్లలో రూ.5,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్న సంస్థ**

ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. నగరంలోని కొంపల్లి ప్రాంతంలో 5.6 ఎకరాల స్థలంలో ఒక ప్రీమియం రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టును అభివృద్ధి చేసేందుకు జాయింట్ డెవలప్‌మెంట్ అగ్రిమెంట్ కుదుర్చుకున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు రూ.850 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేస్తోంది.ఈ ఒప్పందం కింద, భూ యజమానితో కలిసి బ్రిగేడ్ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనుంది. అయితే, భూ యజమాని వివరాలను కంపెనీ వెల్లడించలేదు. బెంగళూరు కేంద్రంగా పనిచేసే ఈ సంస్థ, హైదరాబాద్‌ను తమ వృద్ధికి కీలకమైన మార్కెట్‌గా పరిగణిస్తోంది. భవిష్యత్తులో కూడా నగరంలో మరిన్ని భూములను కొనుగోలు చేసి, కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రణాళికలు రచిస్తోంది.రాబోయే 3-4 సంవత్సరాలలో దేశవ్యాప్తంగా రెసిడెన్షియల్, కమర్షియల్, హాస్పిటాలిటీ, రిటైల్ ప్రాజెక్టులలో సుమారు రూ.5,000 కోట్లు పెట్టుబడి పెట్టాలని బ్రిగేడ్ గ్రూప్ లక్ష్యంగా పెట్టుకుంది. 1986లో స్థాపించిన ఈ సంస్థ బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, మైసూర్‌తో పాటు పలు ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్, హాస్పిటాలిటీ, విద్యారంగాల్లో తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది.

BRIGADE
Building Positive Experiences






## సనాతన ధర్మం, మైథలాజికల్ టచ్‌తో శ్రద్ధాదాస్ 'త్రికాల'

టాలీవుడ్‌లో 'సిద్ధు ఫ్రమ్ శ్రీకాకుళం' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైన శ్రద్ధాదాస్, 'ఆర్య 2', 'గుంటూరు టాకీస్', 'ఏక్ మినీ కథ', 'డిక్టేటర్', 'నాగవల్లి' వంటి చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఇప్పుడు 'త్రికాల'లో మరో విభిన్నమైన పాత్రలో ప్రేక్షకుల ముందుకు రానుంది.. మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాధిక--శ్రీనివాస్ నిర్మించగా, చాగంటి ప్రొడక్షన్ ఎల్ఎల్‌పీ(ఝూ) ప్రపంచవ్యాప్తంగా మే 28న విడుదల చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార చిత్రాలు, పాటలు ప్రేక్షకుల్లో సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. ముఖ్యంగా అడవి నేపథ్యంలో రూపొందించిన విజువల్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, వెన్నులో వణుకు పుట్టించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ట్రైలర్‌ను బట్టి చూస్తే ఇది కేవలం సాధారణ హారర్ చిత్రం కాకుండా దైవిక శక్తులు, అతీత శక్తుల మధ్య జరిగే సస్పెన్స్‌భరితమైన మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు మణి తెల్లగూటి మాట్లాడుతూ...'ప్రపంచంపై చీకటి కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే ఒక శక్తి చుట్టూ 'త్రికాల' కథ సాగుతుంది. సనాతన ధర్మంలోని కొన్ని ఆధ్యాత్మిక అంశాలను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఇప్పటికే ట్రైలర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రేక్షకులకు ఇది సరికొత్త అనుభూతిని అందిస్తుంది' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ...'మైథలాజికల్ టచ్‌తో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సంస్కృతి, ఆధ్యాత్మికత, థ్రిల్ అంశాల సమ్మేళనంగా రూపొందిన 'త్రికాల' ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది'అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి 'అర్జున్ రెడ్డి', 'యానిమల్', 'స్పిరిట్' వంటి చిత్రాలకు సంగీతం అందించిన హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం సమకూరుస్తున్నారు. ఆయన అందించిన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన బలంగా నిలవనుందని చిత్రబృందం చెబుతోంది.

## రామ్ చరణ్‌పై ట్రోలింగ్‌కు జగపతి బాబు కౌంటర్.. అది పనిలేని వాళ్ల పనే అంటూ కామెంట్..

రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కు తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర బృందం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రమోషన్స్‌తో బిజీగా ఉండగా, ఇటీవల జరిగిన కొన్ని ఈవెంట్లలో రామ్ చరణ్ మాట్లాడిన తీరు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. కొన్ని సందర్భాల్లో పేర్లు మర్చిపోవడం, బెంగళూరు ఈవెంట్‌లో కొద్దిగా కన్నడలో మాట్లాడటం వంటి అంశాలపై కొందరు సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు దిగారు. ఈ నేపథ్యంలో 'పెద్ది' చిత్రంలో అప్పలసూరి అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్న జగపతి బాబు తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌పై జరుగుతున్న ట్రోలింగ్‌తో పాటు తనపై గతంలో వచ్చిన విమర్శలపైనా స్పందించారు.



జగపతి బాబు మాట్లాడుతూ.. "ట్రోలింగ్ చేసే వాళ్ల గురించి నేను పెద్దగా పట్టించుకోను. పనిలేని వాళ్లు ఎవ్వరినైనా కిందకి లాగాలనే ఉద్దేశంతో ఇలాంటి పనులు చేస్తుంటారు. చరణ్ ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డాడు, ఎన్ని గాయాలు అయ్యాయి, ఎంత శ్రమించాడు అనే విషయాలను పక్కనపెట్టి చిన్న విషయాలను పట్టుకుని పెద్దదిగా చేస్తున్నారు" అని అన్నారు.అలాగే ఒక పెద్ద సినిమా ప్రమోషన్స్ సమయంలో హీరోలపై ఎంత ఒత్తిడి ఉంటుందో కూడా ఆయన వివరించారు. "ఒకవైపు డబ్బింగ్ పనులు, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్, థియేటర్ల వ్యవహారాలు.. ఇలా ఎన్నో బాధ్యతలు ఒకేసారి ఉంటాయి. ఆ ఒత్తిడిలో చిన్న చిన్న విషయాలు మర్చిపోవడం సహజం. నేను కూడా చాలా సందర్భాల్లో మర్చిపోతాను. అలాంటివాటిని పట్టుకుని ట్రోల్ చేయడం సరికాదు అని వ్యాఖ్యానించారు. ఇక తనపై గతంలో వచ్చిన ట్రోలింగ్‌పై కూడా ఆయన స్పందించారు. "ఒక సీన్ కోసం నేను 70 లేదా 80 టేక్స్ తీసుకున్నానని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. కానీ అందులో ఎలాంటి నిజం లేదు. ఎక్కువలో ఎక్కువ మూడు టేక్స్ తీసుకుని ఉంటాను. పూర్తిగా ఫేక్ సమాచారంతో ట్రోలింగ్ చేశారు" అని స్పష్టం చేశారు. ప్రస్తుతం 'పెద్ది' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రామ్ చరణ్‌ను సరికొత్త అవతారంలో చూపించనున్న ఈ స్పోర్ట్స్ డ్రామాపై అభిమానులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. విడుదలకు ఇంకా కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ప్రమోషన్స్ మరింత జోరుగా కొనసాగుతున్నాయి.



## రామ్ పోతినేని - అనిల్ రావిపూడి క్రేజీ కాంబో ఫైనల్.. దశాబ్దం నిరీక్షణకు ముగింపు

తెలుగు చిత్ర పరిశ్రమలో వినోదం, కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అనీల్ రావిపూడి, తన ఎనర్జీతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరో రామ్ పోతినేని కలయికలో సినిమా వస్తే ఎలా ఉంటుందో అన్న ఆసక్తి అభిమానుల్లో చాలా కాలంగా ఉంది. ఇప్పుడు ఈ ఆసక్తికి తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిలింనగర్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ క్రేజీ కాంబినేషన్ త్వరలోనే పట్టాలెక్కే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. నిజానికి ఈ కాంబినేషన్ చాలా ఏళ్ల క్రితమే సెట్స్‌పైకి రావాల్సి ఉందని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దర్శకుడు అనిల్ రావిపూడి గతంలో తెరకెక్కించిన రాజా ది గ్రేట్ కథను మొదట రామ్ పోతినేనిని దృష్టిలో పెట్టుకుని సిద్ధం చేశారట. ఆ కథను రామ్‌కు వినిపించినప్పటికీ, అప్పట్లో వరుస మాస్ యాక్షన్ సినిమాలతో బిజీగా ఉండటం వల్ల ఆయన ఆ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లలేదని సమాచారం. తరువాత ఆ కథ హీరో రవితేజ వద్దకు వెళ్లి భారీ విజయాన్ని అందుకుంది. అప్పటి నుంచి రామ్ -- అనిల్ రావిపూడి కాంబినేషన్ ఎప్పుడు సెట్స్‌పైకి వస్తుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం, అనిల్ రావిపూడి ఇటీవల రామ్‌కు ఒక కొత్త కథా లైన్ వినిపించగా, అది ఆయనకు బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇద్దరూ తమ తమ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నప్పటికీ, వాటిని పూర్తి చేసిన తర్వాత ఈ సినిమా ప్రారంభం కానుందని టాక్ వినిపిస్తోంది.అలాగే ఈ చిత్రాన్ని 2027 దసరా సందర్భంగా విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ప్రస్తుతం రామ్ పోతినేని తన కెరీర్‌లో కొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. నటుడిగా మాత్రమే కాకుండా దర్శకుడిగానూ కొత్త ప్రయాణం ప్రారంభిస్తున్నారు. ఆయన కెరీర్‌లో 23వ చిత్రంగా రూపొందనున్న ఝూ 23 స్టైలిష్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుంది. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వోల్ఫ్' అనే ట్యాగ్‌లైన్‌తో రాబోతున్న ఈ చిత్రంలో రామ్ 'వీర' అనే పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.

## తనకంటే 21 ఏళ్లు పెద్దవాడైన మిలింద్ సోమన్‌తో బ్రేకప్.. ఎట్టకేలకు నోరు విప్పిన బాలీవుడ్ నటి

ప్రముఖ మోడల్, నటుడు, ఫిట్‌నెస్ ఐకాన్ మిలింద్ సోమన్‌తో తనకున్న పాత ప్రేమాయణం గురించి ఎట్టకేలకు నోరు విప్పింది బాలీవుడ్ నటి షహానా గోస్వామి. ఇటీవల ఒక వీడియో పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె తన రిలేషన్‌షిప్ విషయాల గురించి, మిలింద్‌తో బ్రేకప్ గురించి పంచుకుంది. తాను మొదట్లో మిలింద్‌కు ఒక అభిమానిని అని, ఆ ఆరాధన నుంచి మొదలైన మా ప్రయాణం డేటింగ్ వరకు ఎలా వెళ్లిందో షహానా చెప్పుకొచ్చింది. నాకు 16-17 ఏళ్ల వయసున్నప్పుడు ఢిల్లీలో మిలింద్ నటించిన ఒక సినిమాను చూసి ఆయన మాయలో పడిపోయాను. ఎలాగైనా ఆయనతో మాట్లాడాలని ఇంటర్నెట్‌లో వెతకగా, మిలింద్ ల్యాండ్‌లైన్ నంబర్ దొరికింది. ఆ నంబర్‌కు ఫోన్ చేయగా.. పేజర్ మెషీన్‌లో మిలింద్ తన మొబైల్ నంబర్‌ను వదిలివెళ్లారు. ఆ నంబర్‌కు షహానా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మెసేజ్ చేయగా, మిలింద్ వెంటనే స్పందించారు. అయితే, ఆ తర్వాత దాదాపు ఆరేళ్ల పాటు వారిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకోలేదు, కేవలం మెసేజ్‌ల ద్వారానే టచ్‌లో ఉన్నారు. కాలేజీ చదువుల కోసం షహానా ముంబైకి వచ్చిన తర్వాత, ఇద్దరూ సింగిల్‌గా ఉన్న సమయంలో మళ్లీ కలిసి డేటింగ్ ప్రారంభించారు. మిలింద్ సోమన్‌తో డేటింగ్ చేసే సమయానికి ఆతడి వయసు 43 ఏళ్లు కాగా, షహానా 20లలో ఉంది. అయితే వీరి డేటింగ్‌పై అప్పట్లో విమర్శలు రాగా.. దీనిపై షహానా స్పందిస్తూ.. నేను ఆ వయసు తేడాను ఎప్పుడూ గుర్తించలేదు. నా వయసు కంటే నేను చాలా ఉన్నతంగా ఆలోచించేదాన్ని. మా కుటుంబంలో కూడా అందరం స్నేహితుల్లా ఉంటాం కాబట్టి ఈ విషయం ఇంట్లో చెప్పడానికి ఎలాంటి ఇబ్బంది కలగలేదు అని పేర్కొన్నారు. ఇక 2013లో వీరిద్దరూ విడిపోవడానికి గల కారణాన్ని షహానా బయటపెడుతూ.. చివరి క్షణం వరకు మా ఇద్దరి మధ్య ఎంతో ప్రేమ ఉంది. కానీ కొన్నిసార్లు బంధాలు అనుకున్నట్లు సాగనప్పుడు వాటిని వదిలేయడమే మంచిది. నేను సాంప్రదాయ బంధాలలో ఇమడలేనని నాకు అర్థమైంది. నేను ప్రేమిస్తాను, కానీ స్వేచ్ఛను అంతకంటే ఎక్కువగా కోరుకుంటాను. ఒకరిని బంధించి ఉంచడం ప్రేమ అనిపించుకోదు. మా ఇద్దరి ఆలోచనలు వేరుగా ఉన్నాయని, భవిష్యత్తుపై మా అంచనాలు కలవడం లేదని గ్రహించి పరస్పర అంగీకారంతోనే విడిపోయాం అని షహానా చెప్పుకొచ్చారు.



The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.